₹40

జూన్ - 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

సంపుటి : 33 • సంచిక : 9

Telugu Children's Monthly Magazine



JUNE - 2024

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# CENTRAL BOOKS

SINCE 1947

Your trusted Academic Partner - Then, Now & Forever

**DIAMOND JUBILEE**

**CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP**



| 12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Digital Learning | Books and Stationery Supplies |
|---|---|---|---|---|---|

**Head Office :** 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి: 33 Volume: 33 | సంచిక : 9 Issue : 9 | హైదరాబాద్ Hyderabad | జూన్ June | పేజీలు 52 Pages 52 | రూ. ₹. 40


## లోపలి పేజీల్లో.......








వేసవి సెలవులు... ఎన్జాయ్ చేయండి ..................... మణికొండ వేదకుమార్... .................. 5

టెలిఫోన్ సృష్టికర్త అలెగ్జాండర్ గ్రాహంబెల్ (సైంటిస్ట్) .... బాలచెలిమి డెస్క్ ............................ 6

భలే భాను (కథ) ......................................... డా. హారిక చెరుకుపల్లి....................... 7

డా॥ కల్పనా చావ్లా ......................................... షీరోస్-256...................... ............. 9

ఏడున్నొక్క గీతలతో తెలుగు దస్తూరి సమస్తం (అక్షరం)... వై. మల్లికార్జున రావు ....................... 10

వసుధ (కథ)............................................... డా. నీరజ అమరవాది ....................... 11

పనివాడి చాతుర్యం (కథ).................................. లియో టాల్ స్టాయ్ ......................... 13

రాము తెలివి (కథ)........................................ డా॥ వాసరవేణి పరశురాం ................. 14

సబ్జా విండూర్ (ఆట) ...................................... చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు ..... 15

జింక-నత్త (కథ) .......................................... డా. షేఖ్ అబ్దుల్ ఘనీ ....................... 16

బొంతలు (కథ)............................................ గరిపెల్లి అశోక్ ............................... 17

లేపాక్షి (కథ) ............................................... జుగాష్ విలి ................................... 19

మాయం (నాటిక) ......................................... డా॥ కాసర్ల నరేశ్‌రావు ....................... 20

విజేత, బొట్లు పెట్టు (పాట) ............................... గంగదేవు యాదయ్య......................... 23

తంగేడు చెట్టు (చెట్టు - చేమ) .......................... కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి......................... 24

డాబా మీద జ్ఞాపకాలు (కవిత)........................... గద్వాల సోమన్న............................ 25

రాజుగారి పెంపుడు కోతి .................................. పంచతంత్ర కథలు .......................... 25

పెళ్ళి చేసుకోడానికి చాలా చిన్న వయస్సు (కార్టూన్)...... సిహెచ్. మాహిక ............................ 26

చెట్టే కోపిస్తే (కథ).......................................... సంగన్నభట్ల చిన్నరామకృష్ణ................. 29

నాట్యం చేసే సబ్బు బుడగలు (సైన్స్)...................... డాక్టర్ మహీధర నళినీ మోహన్ ............ 31

గాలిపటం (కథ)............................................ టి వి రామకృష్ణ ............................. 32

| | | |
|---|---|---|
| నీలిపిట్ట (గేయం) | ఎం. హరికిషన్ | 34 |
| బొమ్మలేద్దాం | నేర్చుకుందామా | 35 |
| నా తోటలో (కథ) | వడ్డేపల్లి వెంకటేష్ | 37 |
| దేశమును ప్రేమించుమన్నా (దేశభక్తి గీతం) | గురజాడ అప్పారావు | 39 |
| కలం చెలిమి | బాలచెలిమి | 39 |
| ప్రథమ చికిత్స (ఆరోగ్యం – విజ్ఞానం) | తెలంగాణ సారస్వత పరిషత్తు, | 40 |
| తెలంగాణా గ్రీన్ వ్యాలీలో 'గాడి'ద జలపాతం (విహార స్థలాలు) | డా. ద్యావనపల్లి సత్యనారాయణ | 41 |
| ఇంజనియర్ జంతువు (జంతువు) | బాలచెలిమి | 42 |
| పిల్లలు.. పిడుగులై మెరిశారు (తెలంగాణ బాలోత్సవ్) | బాలచెలిమి డెస్క్ | 43 |
| రేపటి తరం కోసం మరో గ్రంథాలయ ఉద్యమ యాత్ర | బాలచెలిమి డెస్క్ | 43 |
| సేంద్రియ ఎరువులు (కథ) | ఎం.డి. అస్మిన్ | 44 |
| ఆడుతూ పాడుకుందాం | బాలచెలిమి | 45 |
| బాల సాహిత్య సమ్మేళనం... | బాలచెలిమి డెస్క్ | 46 |
| అంతరిక్ష విజ్ఞానం (జి.కె.) | తెలంగాణ సారస్వత పరిషత్ | 47 |
| సమాచారం | బాలసాహితీవేత్తలు | 48 |
| నేనూ నా బాల్యం (వ్యక్తిత్వం) | బాలచెలిమి | 50 |




# చెలిమి లేఖలు

అంకుల్! బాలచెలిమి బాగుంది. కథలు బాగున్నాయి. కథల్లో నీతి బాగుంది. మాకు కొత్త ఆటలు కావాలి. నవ్వించే కథలు కావాలి. జోక్స్, కార్టూన్లు కావాలి. జి.కె. కావాలి. ఆడుకుంటూ పాడుకునే పాటలు కావాలి. బాలచెలిమి రంగుల్లో వస్తే బావుంటుంది. 'బాలచెలిమి మీదే' అన్నారుగా. అందుకే ఇవన్నీ అడుగుతున్నాం అంకుల్!

**ప్రిన్సీ, బిట్టూ**
అమలాపురం

విద్యార్థినీ, విద్యార్థుల్లో సృజనశక్తుల్ని వెలికి తీసి, వాటిని వెలుగులోకి తేచ్చే ప్రయత్నంలో మీరు తెచ్చిన పది జిల్లాల బడి పిల్లల కథలు, పర్యావరణ కథలు, వివిధ పాఠశాలల విద్యార్థుల కథల పుస్తకాల బహుళ ప్రచారం పొందాయి. మీ అకాడమీ తరఫున మీరు వివిధ జిల్లాల్లో నెలకొల్పిన గ్రంథాలయాలు పిల్లల్లో పఠనాసక్తిని పెంచుతున్నాయి. ఆ కృషికి బాలచెలిమి పత్రిక మరింత మేలు చేస్తుంది. కెరీర్ జీవితమైన చోట మీ కృషి పిల్లల్లో సృజనాత్మకతకు, వారి జ్ఞాన విస్తృతికి దోహదం చేస్తుంది. మీకు అభినందనలు.

**కె. విద్యుల్లత**
హైదరాబాద్

డిజిటల్ రంగానికి అలవాటు పడిన పిల్లలను పుస్తకాల వైపు మళ్లించడంలో చిల్డ్రన్స్ అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు చాలా విలువైనవి. బాలచెలిమి ముచ్చట్లు, కథల పుస్తకాలు, బాలచెలిమి పత్రిక పిల్లల్లో ఉన్నత విలువల పట్ల అవగాహన పెంచుతాయి. బాలచెలిమిలో మరిన్ని కొత్త శీర్షికలో పెట్టండి సార్...

**చామర్తి అనూష**
హుజూర్‌నగరం


*ముఖచిత్రం:*
కంది నర్సింలు
m : 8978766619

*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728



**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# మళ్లీ చదువుల ప్రపంచంలోకి...

సెలవులు అయిపోయాయి, స్కూళ్ల తలుపులు తెరుచుకుంటున్నాయి. ఆట విడుపుల తర్వాత మీరు సరంజామాతో స్కూలుకు వెళ్లే వేళయింది. ఆనందాల సెలవుల నెమరేత నుండి మళ్లీ చదువుల వైపు సాగిపోవాలి. స్కూలు 'రీఓపెనింగ్ నాటికి మీ పాత పుస్తకాలు యూనిఫామ్, షూస్, బ్యాగ్ వంటి ఇప్పుడు మీకు అవసరం లేని వాటిని పేద విద్యార్థులకు ఇవ్వండి. మీ కొత్త తరగతిలోకి మీ గత కాలపు స్నేహితులు కొందరు రాకపోవచ్చు. కొత్త క్లాస్‌మేట్స్ రావొచ్చు. వారితో స్నేహంగా, ప్రేమగా ఉండండి. వారితో సంభాషించండి. పరస్పర అభిరుచులు పంచుకోండి. వారితో ఆడుకోండి. సృజనాత్మక క్రియల్లో ఒకరికి ఒకరు తోడుగా ఉండండి. ఒకరి నుండి ఒకరు నూతన విషయాలు నేర్చుకోండి. మీ స్పోర్టివ్‌నెస్ ఈర్ష్యలకు, ద్వేషాలకు కారణం కాకుండా జాగ్రత్త పడండి. మీ దృష్టిని పాఠ్యాంశాలపై నిమగ్నం చేయండి. అలా అని ఆటపాటలను, పాఠ్యేతర పుస్తకాలు చదవడాన్ని మరవకండి. మీ వ్యక్తిత్వ నిర్మాణానికి పునాదులు వేసే చోటు, సమయమూ ఇదే...



బాలచెలిమి ఎప్పటికప్పుడు కొత్త కొత్త శీర్షికలతో రంగు రంగుల హరివిల్లుతో మీ ముందుకు వస్తుంది. కలం చెలిమి శీర్షికకు మీ ఫొటోలు, మీ బయోడేటా పంపండి. మీ అభిరుచులకు తగిన వారిని ఎన్నుకొని కలం స్నేహం చేయండి. కొత్త స్నేహాలు, కొత్త ప్రాంతాలు, కొత్త భావనలు, ఆలోచనలు మీకు పరిచయం అవుతాయి. బాల చెలిమిలో మీకు నచ్చిన, విషయాలపై ఉత్తరాలు రాయండి. అలాగే మీరు రాసిన కథలు, గేయాలు, కవితలు బాలచెలిమి కోసం పంపండి.

మీరు భావిపౌరులే కాదు. రేపటి సృజనకారులు, సమాజ నిర్మాతలు కూడా.

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి



సైంటిస్ట్

# టెలిఫోన్ సృష్టికర్త

# అలెగ్జాండర్ గ్రాహంబెల్



టెలిఫోన్ ఆవిష్కరణకు ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్త అలెగ్జాండర్ గ్రాహం బెల్, మనకు తెలిసిన కమ్యూనికేషన్‌లో విప్లవాత్మక మార్పులు చేశారు. అతని భార్య, తల్లి ఇద్దరూ చెవిటివారు. దీనితో సౌండ్ టెక్నాలజీపై అతని ఆసక్తి పెరిగింది. టెలిఫోన్‌కు నిజమైన మార్గదర్శకుడు బెల్ కాదా అనే దానిపై కొంత వివాదం ఉన్నప్పటికీ, అతను సాంకేతికతకు ప్రత్యేక హక్కులను పొందాడు. 1877లో బెల్ టెలిఫోన్ కంపెనీని ప్రారంభించాడు. కమ్యూనికేషన్‌లలో చేసిన కృషి కోసం 18 కంటే ఎక్కువ పేటెంట్‌లను సంపాదించాడు. అలెగ్జాండర్ గ్రాహం బెల్ మార్చి 3, 1847న స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బర్గ్‌లో జన్మించారు. బెల్ తండ్రి ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు, అతని తల్లి చెవుడు అయినప్పటికీ, నిష్ణాతురాలైన పియానిస్ట్.

బాల్యంలో అలెగ్జాండర్ మేధో ఆసక్తి ఉన్న పిల్లవాడు, అతను పియానోను అభ్యసించాడు. చిన్న వయస్సులోనే వస్తువులను కనిపెట్టడం ప్రారంభించాడు. 12 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, తిరిగే తెడ్డులు, నెయిల్ బ్రష్‌లతో కూడిన పరికరాన్ని కనుగొన్నాడు, ఇది వ్యవసాయ ప్రక్రియలో గోధుమ ధాన్యం నుండి పొట్టులను త్వరగా తొలగించడంలో ఉపయోగపడుతుంది. 16 సంవత్సరాల వయస్సులో, బెల్ స్పీచ్ మెకానిక్‌లను అధ్యయనం చేయడం ప్రారంభించాడు. అతను రాయల్ హై స్కూల్, యూనివర్శిటీ ఆఫ్ ఎడిన్‌బర్గ్‌లో చదివాడు. 1870లో, బెల్ తన కుటుంబంతో సహా కెనడాకు వెళ్లారు. మరుసటి సంవత్సరం, అతను యునైటెడ్ స్టేట్స్‌లో స్థిరపడ్డాడు. 1872లో, అతను బోస్టన్‌లో స్కూల్ ఆఫ్ వోకల్ ఫిజియాలజీ మరియు మెకానిక్స్ ఆఫ్ స్పీచ్‌ను ప్రారంభించాడు, అక్కడ చెవిటి వారికి మాట్లాడటం నేర్పించారు. 26 సంవత్సరాల వయస్సులో, బోస్టన్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఒరేటరీలో వోకల్ ఫిజియాలజీ, ఎలోక్యూషన్ ప్రొఫెసర్ అయ్యాడు.బెల్ మాబెల్ హబ్బర్డ్ అనే చెవిటి విద్యార్థిని జూలై 11, 1877న వివాహం చేసుకున్నారు. 1871లో, బెల్ హార్మోనిక్ టెలిగ్రాఫ్‌పై పని చేయడం ప్రారంభించాడు. వైర్ల ద్వారా మానవ స్వరాన్ని ప్రసారం చేసే మార్గాన్ని కనుగొనడంలో బెల్ నిమగ్నమయ్యాడు. 1875 నాటికి, బెల్ తన భాగస్వామి థామస్ వాట్సన్ సహాయంతో విద్యుత్తును ధ్వనిగా మార్చగల ఒక సాధారణ రిసీవర్‌తో ముందుకు వచ్చాడు. మార్చి 7, 1876న, బెల్ అతని టెలిఫోన్ పేటెంట్‌ను పొందాడు. 1877 నాటికి, ఈనాడు AT&Tగా పిలవబడే బెల్ టెలిఫోన్ కంపెనీ స్థాపించబడింది. టెలిఫోన్‌తో పాటు, బెల్ తన కెరీర్‌లో వందలాది ప్రాజెక్ట్‌లలో పనిచేశాడు మరియు వివిధ రంగాలలో పేటెంట్లను పొందాడు. అతని ఇతర ముఖ్యమైన ఆవిష్కరణలలో కొన్ని: మెటల్ డిటెక్టర్: హత్యకు గురైన ప్రెసిడెంట్ జేమ్స్ ఎ. గార్ఫీల్డ్ లోపల బుల్లెట్‌ను గుర్తించడానికి బెల్ మొదట్లో ఈ పరికరాన్ని రూపొందించాడు. ఫోటోఫోన్: ఫోటోఫోన్ కాంతి పుంజం మీద ప్రసంగాన్ని ప్రసారం చేయడానికి అనుమతించింది. గ్రాఫోఫోన్: ఫోనోగ్రాఫ్ యొక్క ఈ మెరుగైన వెర్షన్ ధ్వనిని రికార్డ్ చేసి ప్లే బ్యాక్ చేయగలదు. ఆడియోమీటర్: ఈ గాడ్జెట్ వినికిడి సమస్యలను గుర్తించడానికి ఉపయోగించబడింది. 1880లో, బెల్‌కు ఫ్రెంచ్ వోల్టా ప్రైజ్ లభించింది, ఆ డబ్బుతో అతను వాషింగ్టన్, D.C.లో శాస్త్రీయ ఆవిష్కరణకు అంకితమైన వోల్టా లాబొరేటరీ అనే సౌకర్యాన్ని స్థాపించాడు. బెల్ చెవిటివారికి ప్రసంగం నేర్పడంలో సహాయపడటానికి అనేక పద్ధతులను కనుగొన్నాడు. 1896 నుండి 1904 వరకు నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ అధ్యక్షుడిగా పని చేశాడు. కెనడాలోని నోవా స్కోటియాలో బెల్ మధుమేహం వల్ల వచ్చే సమస్యలతో తన 75వ ఏట ఆగస్టు 2, 1922న మరణించాడు. బెల్ అంత్యక్రియల సమయంలో, అమెరికాలోని ప్రతి ఫోన్‌ని నిశ్శబ్దం చేసి ఘనమైన నివాళి అర్పించారు.

బాలచెలిమి డెస్క్

కథ

జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా...

# భలే భాను



కైరంకొండ బాబు

భానుకు బోలెడు సెలవులు వచ్చేశాయ్! పొద్దున్న నుండి రాత్రి వరకు ఆడుకోవడం మాత్రమే చేయాలి అని నిర్ణయించుకున్నాడు. ఎందుకంటే భానుకు స్నేహితులు ఎక్కువ. వాళ్ళుండే కాలనీ అంతా అపార్ట్మెంట్ ఇళ్ళే! చాలా మంది పిల్లలున్నారు. కొందరు భాను కన్నా పెద్దవాళ్ళు, కొందరు చిన్నవాళ్ళు. అయినా భానుకు అంతా స్నేహితులే! ప్రతి వేసవిలో పిల్లలంతా కలిసి రకరకాల ఆటలే కాకుండా, కొత్త కొత్త కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. ఈ ఏడు వేసవిలో చాలా చేయాలని ప్రణాళిక వేసుకున్నారు. కానీ ఈ సారి చాలా కుటుంబాలు వేసవి సెలవులకు వాళ్ళ సొంత ఊళ్ళైన పల్లెటూళ్ళకు వెళ్ళిపోయారు. భాను వాళ్ళు కూడా ఇవాళే బయలుదేరుతున్నారు. మళ్ళీ రెండు నెలల వరకు తిరిగి రారు. అందుకే భాను చాలా బాధగా ఉన్నాడు.

భానుకు నానమ్మ ఊరికి వెళ్ళడం ఇష్టమే కానీ వేసవి మొత్తం అక్కడే గడపడం అంటేనే కొంచెం కష్టంగా ఉంది. ప్రతీ ఏడు ఒక వారం రోజులు మాత్రమే ఊరికి వెళ్ళేవాడు. ఈ సారి నీటి కొరత చాలా ఎక్కువగా ఉండటం వలన కాలనీలో కుటుంబాలన్నీ పల్లె బాట పట్టక తప్పలేదు.

మొత్తానికి భాను బామ్మ గూటికి చేరుకున్నాడు. అక్కడ పక్కింటి బాబాయితో కలిసి పొలానికి వెళ్ళేవాడు. చెరువులో ఈత కొట్టడం నేర్చుకున్నాడు. బామ్మతో కలిసి చెట్లకు నీరు పోయడం, పాదులకు తీగలు కట్టడం అన్నీ చేసేవాడు. ఆ ఊళ్ళో కూడా ఇప్పుడు భానుకు కొత్త స్నేహితులయ్యారు. భాను తన బాధను మరిచిపోయాడు. ఈ ఊళ్ళోనే ఉంటే బాగుండు కదా అనుకునేవాడు. ఇక్కడ నీటి కొరత లేదు. హాయిగా ఎంతసేపైనా స్నానం చేయొచ్చు. గాలిలో పొగ లేదు. హాయిగా పెరట్లో బామ్మ మంచం మీద పడుకుని ఆకాశంలో చుక్కలు లెక్కపెడుతూ, కబుర్లు చెబుతూ పడుకోవచ్చు. ముఖ్యంగా రోడ్డు దాటడానికి ఎవరి సహాయం అవసరం ఉండదు. ఇలా ఉన్నాయి భాను ఆలోచనలు. అవన్నీ వాళ్ళ నాన్నకు చెబితే తన ఉద్యోగం సిటీలోనే ఉంది అన్నాడు. అమ్మేమో చదువు సిటీలోనే బాగుంటుందని చెప్పింది. బామ్మ 'ఇక్కడే ఉండిపోరా'అంది.

వేసవి సెలవులు ఇంకో వారమే ఉన్నాయి. భాను వాళ్ళ అపార్టుమెంట్లో నీటి కొరత ఇంకా అలాగే ఉంది. కానీ వెళ్ళక తప్పదని అన్నాడు నాన్న. భానుకు ఇక్కడ చెరువులో రోజూ రెండు గంటలు ఈత కొట్టడం బాగా అలవాటయింది. సిటీకి వెళ్ళాక రెండు చెంబుల నీళ్ళతో స్నానం గురించి ఆలోచించడానికే కష్టంగా ఉంది. కానీ తప్పదు. అమ్మానాన్నలతో పాటు తన సామాన్లను కూడా సర్దుకున్నాడు. బామ్మకు టాటా చెప్పి ఊరికి బయలుదేరాడు. భాను వాళ్ళ ఊరికి చేరుకున్నాడు. ఇంటికి రాగానే కాళ్ళు కదుగు కునేందుకు కుళాయి తిప్పితే నీళ్ళు లేవు. ఇంకో రెండు గంటలకు గానీ రావని తెలిసింది. భాను తన బ్యాగును తెరిచి చూపించాడు. అమ్మానాన్న ఆశ్చర్యపోయారు. అందులో నిండా చిన్నా పెద్ద అన్నీ నీళ్ళ సీసాలే! "మనకు నీళ్ళుండవేమో అనిపించి తెచ్చా. బట్టలు వదిలేసా. మళ్ళీ బామ్మ వచ్చేప్పుడు తెస్తుందిలే నీళ్ళ సీసా మూత తీస్తూ చెప్పాడు భాను.

**డా. హారిక చెరుకుపల్లి**
m : 9000559913

## సామెతలు

తెలుగు సాహిత్యంలో సామెతల కేమీ కొదవ లేదు. నగర జీవి మరిచిపోయినా ఈ సామెతలు పల్లె జనం నోళ్లలో నేటికీ నానుతూ ఉన్నాయి. జంతు వులు, చెట్లు, వ్యవసాయం... ఇలా ఎన్నో విషయాల గురించి విలువైన సమాచారాన్ని సామెతల్లో నిక్షిప్తం చేశారు మన పూర్వీకులు. అటువంటి సామెతల నుంచి కొన్ని తెలుసుకుందాం.

- అతివృష్టి అయినా అనావృష్టి అయినా ఆకలి బాధ తప్పదు
- అదను ఎరిగి సేద్యమూ పదును ఎరిగి పైరు
- అన్ని కార్తెలు తప్పినా హస్తకార్తె తప్పదు
- అన్నీ పండించిన వాడికే అన్నం కరువు
- అయితే ఆరిక కాకుంటే కంది
- అగ్నికి వాయువు తోడైనట్టు
- అచ్చివచ్చిన భూమి అడుగైనా చాలు

# డా॥ కల్పనా చావ్లా

ఒక కాస్మిక్ ట్రైల్ బ్లేజర్ స్ఫూర్తిదాయకమైన కలలు. కల్పనా చావ్లా (మార్చి 17, 1962 – ఫిబ్రవరి 1, 2003) ఒక భారతీయ – అమెరికన్ వ్యోమగామి, అంతరిక్షంలో భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళ. కల్పనా చావ్లా హర్యానాలోని కర్నాల్‌లో జన్మించింది. చిన్న వయస్సులోనే ఆమెకి ఆకాశ యానంపై మోహం మొదలైంది. ఆమె పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత యునైటెడ్ స్టేట్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. టెక్సాస్ విశ్వవిద్యాలయం నుండి



ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్ మరియు పిచ్.డి పొందారు. కొలరాడో విశ్వవిద్యాలయం నుండి ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేసారు.

విమాన ప్రయాణం పట్ల కల్పనకు ఉన్న అభిరుచి ఆమెను సర్టిఫైడ్ స్టేట్ ఇన్‌స్ట్రక్టర్ మరియు కమర్షియల్ పైలెట్‌గా మార్చింది. ఆమె అసాధారణ నైపుణ్యం, విద్యయందు విజయాలు చివరికి నాసా దృష్టిని ఆకర్షించాయి. 1994లో ఆమె అంతరిక్ష సంస్థలో వ్యోమగామి అభ్యర్థిగా అంగీకరించబడింది.

“1997లో కల్పన స్పేస్ షటిల్ కొలంబియా మిషన్ ఎస్‌టిఎస్–బి7లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్ళిన భారతీయ సంతతికి చెందిన మొదటి మహిళగా చరిత్ర సృష్టించింది.’

ఆమె తరవాత 2003లో దురదృష్టకరమైన ఎస్‌టిఎస్ 107 మిషన్‌లో ప్రయాణించింది. టెక్సాస్ మీదుగా భూమి యొక్క వాతావరణంలోకి తిరిగి ప్రవేశించినప్పుడు స్పేస్ షటిల్ కొలంబియా విచ్ఛిన్నమై కల్పనతో సహా మొత్తం ఏడుగురు సిబ్బంది విషాదకరంగా ప్రాణాలు కోల్పోయారు. కల్పనా చావ్లా వర్ధమాన వ్యోమగాములకు స్ఫూర్తినిస్తూనే ఉన్నారు. ఆమె ధైర్యం, పట్టుదల మరియు కలల సాధనకు ప్రతీక. కల్పనకు విమానాల బొమ్మలు గీయటం, పెయింట్ చేయటం చాలా ఇష్టం. చిన్నతనంలో ఆమె పాఠశాలలో సైన్స్ మరియు భౌగోళిక ప్రాజెక్టుల కోసం విశ్వంలో నక్షత్రరాశుల మధ్యలో ఎగిరే నమూనాలను నిర్మించింది.

– ‘షీరోస్–256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా’ నుండి....

# ఏడున్నొక్క గీతలతో తెలుగు దస్తూరి సమస్తం

మాతృభాషలో తప్పుల్లేకుండా మాట్లాడ గలగడం, అక్షర దోషాలు లేకుండా రాయగలగడం ప్రపంచంలోని ప్రతీ మనిషి బాధ్యత. మెలకువలు, ఆసక్తి మరియు అభ్యాసంతో వీటిని సునాయాసంగా సాధించేయవచ్చు.

తెలుగు భాషలో ఉన్న 52 అక్షరాలు, హల్లుల గుణింతాలు మరియు వాటి ఒత్తులు... వీటన్నింటినీ ఏడే గీతలతో మరియు ఒక అద్భుతమైన అక్షరాన్ని అభ్యాసం చేయడంతో సొంతం చేసుకోవచ్చు.

1. అపసవ్య దిశలో (ఎడమ వైపు నుంచి) సున్న ఆకారం
2. సవ్యదిశలో (కుడివైపు నుంచి) సున్న ఆకారం.
3. తలకట్టులో ఉండే మొదటి చిన్న ఏటవాలు గీత.
4. తలకట్టులోని రెండవ పెద్ద ఏటవాలు గీత.
5. ఎడమ వైపు నుంచి కుడి వైపుకు ఒక అడ్డ గీత.
6. కుడివైపు నుంచి ఎడమ వైపుకు ఒక అడ్డ గీత.
7. ఒక చిన్నపాటి నిలువు గీత.

ఈ ఏడు గీతలతో పాటు “శ్రీ” అనే అక్షరం కూడా రాస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఎందుకంటే తెలుగు భాషలోని ఎక్కువ అక్షరాలను సవ్యదిశ, అపసవ్యదిశల కలయికతో అభివృద్ధి చేశారు కాబట్టి. ఈ రెండింటి సమన్వయమైన ‘శ్రీ’ అనే అక్షరం తెలుగు దస్తూరిని సొబగుగా తయారు చేయడంలో కీలక పాత్ర వహిస్తుంది.



బొమ్మలో చూపించిన విధంగా ‘సింగల్ రూల్డ్ పేపర్’ మీద ఒక్కొక్క గీతను రెండేసి లైన్లు అభ్యసించాలి. ఈ గీతలను అభ్యసించిన వెంటనే ఏవైనా 10–20 పదాలు (ముందుగా సరళమైనవి; క్రమేపీ కాస్త క్లిష్టమైనవి) రాయాలి.

కాబట్టి 7+1=100

(ఏడు గీతలు మరియు శ్రీ అభ్యాసం తెలుగు చేతిరాతను వందశాతం మెరుగుపరుస్తుంది)

అందరికీ అందమైన దస్తూరి ప్రాప్తిరస్తు.

– వై. మల్లికార్జున రావు,
డైరెక్టర్, మహా అకాడెమి
m : 9966961642




# వసుధ




అమ్మా, అమ్మా! అంటూ ఎవరో గట్టిగా పిలుస్తున్ననిపించి చంద్రిక అటూ ఇటూ చూసింది. ఎవరూ కనబడలేదు. మళ్లీ అమ్మా అమ్మా అన్న పిలుపు వినిపించింది. వసుధ గొంతులాగా అనిపించి చంద్రిక, వసుధ దగ్గరికి వెళ్ళింది. నిద్రలోనే కలవరిస్తోంది. "కిటికీ లోంచి నీళ్ల వస్తున్నా యంటోంది. ఆ పక్క కిటికీ నుండి చెడు వాసనతో కూడిన గాలి వస్తోంది. నాకు ఊపిరి ఆడడం లేదని అరుస్తోంది. ఇంతలో చూడు చూడు మన చెట్లన్నీ నీళ్లు లేక ఎండి పోయాయి అని ఏడుస్తోంది. ఇల్లు కదులుతోంది, భూకంపం వస్తోందంటూ'" వసుధ లేచి కూర్చుంది. పక్కనే ఉన్న చంద్రిక, "ఏమైంది. భయపడే కల ఏమైనా వచ్చిందా అని' అడిగింది.

'అమ్మా! మన ఇల్లుని జాగ్రత్తగా చూసుకోవాలి' అంది.

'మన ఇల్లు బాగానే ఉందిగా. నీకు కావలసినట్లు నీ గదిని ఉంచానుగా..!'

'అంటే మనందరి ఇల్లు. మన భూమి. ఆ భూమి బాధ పడుతోందమ్మా!'

వసుధా! నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావటం లేదు!

'అమ్మా! చెబుతాను విను. మనం ప్రతి సంవత్సరం 'జూన్ 5వ తేదీని' పర్యావరణ దినోత్సవంగా జరుపుకుంటాము తెలుసా!'

'అవును. చిన్నప్పుడు ఆ రోజు నువ్వు బడికి ఆకుపచ్చ రంగు డ్రస్ వేసికెళ్లేదానివి' అంటూ చంద్రిక గుర్తు చేసుకుంది.

'నేను ఆకుపచ్చరంగు వేసుకుంటున్నా, కాని మన చుట్టుపక్కల పచ్చదనం తగ్గిపోతోంది. అమ్మా నిన్న సైన్స్ క్లాస్‌లో మా టీచర్ చెప్పారు. మనం చెట్లను నాటకుండా చెట్లను కొట్టేయడం వల్ల భూతాపం పెరిగిపోతోందట. సముద్రజలాలు వేడెక్కడం వల్ల కొన్ని జీవులు బతకలేక పోతున్నాయట. భూతాపంతోనే ఏడాదిన్నరలో కురవాల్సిన వర్షం ఇటీవల దుబాయిలో ఒక్కరోజులో పడిందట. వర్షాలు, వరదల వల్ల వందలాది ప్రాణాలు

గాలిలో కలిసిపోయాయి. జంతువుల నివాసం అడవులు కదా. దానిని మనం ఆక్రమించుకోవడం వల్ల అవి మన ఇళ్లల్లోకి వస్తున్నాయట. అంటే మూగజీవులకు నిలువనీడ లేకుండా చేస్తున్నాం. జంతువుల వల్ల మనకు, పర్యావరణానికీ మేలు జరుగుతుంది. భారీగా పెరుగుతున్న వాహనాల వల్ల, వాయుకాలుష్యం కావడమే కాక భూమి కూడా వేడెక్కుతోంది. వాయుకాలుష్యం వల్ల శ్వాసకోస వ్యాధుల కారణంగా చిన్నపిల్లలు మరణిస్తున్నారు.

ప్లాస్టిక్ వస్తువులు చూడడానికి అందంగా ఉంటాయి. తేలికగా ఉంటాయి. తక్కువ ధరకి వస్తాయని కొంటున్నాము. దానివల్ల వచ్చే నష్టాన్ని ఊహించలేము. అవి త్వరగా మట్టిలో కలవక జంతువులకు కూడా హాని చేస్తున్నాయి. ఇప్పుడు మన శరీర భాగాలలో ప్లాస్టిక్ రేణువులు ఉన్నాయని డాక్టర్లు చెబుతున్నారు. అనేక రకరకాలుగా శరీరానికి హాని చేస్తున్నాయి.

అన్నిటా అభివృద్ధిని సాధించిన మనిషి తాను కూర్చొన్న కొమ్మను తానే నరుక్కున్నట్లు, మనం నివసించే భూమికి మనమే నష్టం చేస్తున్నామ'ంటూ వసుధ బాధతో చెప్పింది. ఆ మాటలను వింటున్న వసుధ వాళ్ల నాన్న, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా ఆలోచిస్తున్నాయని చెప్పారు. 1972 నుండి ప్రతి సంవత్సరం ప్రపంచ దేశాలు ఏదైనా ఒక దేశంలో సమావేశమైతారు. ఒక థీమ్‌తో పర్యావరణ పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల గురించి చర్చిస్తారు. 2024లో "మన భూమి" అనే నినాదంతో అన్ని దేశాలు సౌదీ అరేబియాలో




సమావేశమవుతారని చెప్పారు. అంతే కాదు మన ఇల్లును మనం ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అలాగే మన భూమి కోసం అందరం కలిసి కృషి చేయాలని చెప్పారు.

'ఈ రోజు నుండి మనం ప్లాస్టిక్ వస్తువులను వాడద్దు. మొక్కలను నాటుదాం. పుట్టినరోజు బహుమతిగా మొక్కలను ఇద్దాం. బయటికి వెళ్లేటప్పుడు, బట్టతోకాని నారతో చేసిన సంచులను తీసికెళదాం. వీలైనంత వరకు ప్రజారవాణాను ఉపయోగించుకుందాము. మార్పుకు మనమే 'శ్రీకారం చుడదామ'ని చంద్రిక చెప్పింది.


డా. నీరజ అమరవాది
m : 9849160055




ఒక ఊళ్ళో షావుకారు ఇంట్లో పెళ్ళి జరుగుతోంది. పెళ్ళికి చాలామంది జనం వచ్చారు. అందరూ బయట నించుని మాట్లాడుకోసాగారు. పక్క ఇంట్లో యజమాని తన పనివాణ్ణి పిలిచి "షావుకారు ఇంట్లో పెళ్ళికి ఎంతమంది మనుషులు వచ్చారో చూసిరా!" అన్నాడు. పనివాడు 'సరే'నని షావుకారు ఇంటికి వెళ్ళాడు. వాడు అటూ ఇటూ చూసి ఒక పెద్ద కర్ర దిమ్మను తీసుకువెళ్ళి, షావుకారు గుమ్మానికి అడ్డంగా వేసి, అక్కడే ఉన్న ఒక బల్లపై కూర్చొని చూడసాగాడు. పెళ్ళికి వచ్చిన వారు ఒక్కొక్కరూ లోపలికి రావటం మొదలెట్టారు. అందరూ కర్ర దిమ్మను దాటుకుంటూ లోపలికి వస్తున్నారు. ఒక ముసలివాడు మాత్రం కర్ర దిమ్మ గుమ్మానికి అడ్డంగా ఉండటం చూసి దానిని తీసి పక్కన పెట్టి లోపలికి వచ్చాడు. పనివాడు తిరిగి తన యజమాని దగ్గరికి వచ్చాడు.

"పెళ్ళికి ఎంతమంది మనుషులు వచ్చారో చూశావా?" అని ప్రశ్నించాడు యజమాని.

"చూశానండి!" అన్నాడు పనివాడు. "ఎంతమంది వచ్చారు?"

"ఒకే ఒక్క ముసలివాడండి!" అన్నాడు పనివాడు. యజమాని ఆశ్చర్యపోయి– "ఒక్కరు రావటమేమిట్రా?" అని ప్రశ్నించాడు.

"అవును....... నేను ఒక కర్ర దిమ్మను గుమ్మానికి అడ్డంగా పెట్టానండి. అందరూ దానిని దాటుకుంటూ ఒకరి వెనక ఒకరు గొర్రెల్లాగా వచ్చారు. కానీ, ఒక్కరు కూడా దానిని తీసి పక్కన పెట్టలేదు. ఒకే ఒక్క ముసలివాడు మాత్రం దానిని తీసి పక్కకు పెట్టి వచ్చాడండి. కాబట్టి అతనే నిజమైన 'మనిషి' అన్నాడు పనివాడు. పనివాడి చాతుర్యానికి యజమాని నిర్ఘాంత పోయాడు.

లియో టాల్ స్టాయ్

కథ

# రాము తెలివి



అనగనగా గుండారం ఊరు. ఆ ఊరిలో సురేశ్, సువర్ణ అనే దంపతులు ఉన్నారు. వీరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరిది ఉత్తమ కుటుంబం. వీరికి రాము అను కొడుకు ఉన్నాడు. అతడు రెండవ తరగతి చదువుతున్నాడు. రోజు బడికి పోతాడు. సాయంకాలం దోస్తులతో ఆడుకుంటాడు. టైరును కట్టెతో తోలడం, సైకిల్తో అటిటు తిప్పడం, పాండబ్బ ఆడటం, గోటీలు ఆడటం చేస్తాడు. రాముకు నాయనమ్మ రేణుక ఉంది. నాయనమ్మ అంటే రాముకు ఎంతో ఇష్టం. నాయనమ్మకు రాము అంటే ఇష్టం. సువర్ణ కాయలు, పండ్లు నాయనమ్మకు ఇచ్చిరా అనగానే నిమిషంలో ఇచ్చి వస్తాడు. నాయనమ్మ ఇవి తిను అంటాడు. అన్నం తెచ్చి తినమంటాడు. రోజు నాయనమ్మ దగ్గర కథలు చెప్పించుకుంటాడు. రాముకు సాహసం కథలంటే చాలా ఇష్టం. సురేష్, సువర్ణ రోజు పొలం పనులకు వెళ్లుతారు. ఒకరోజు పగలు బడి నుంచి వచ్చాడు. నాయనమ్మ నీళ్లని వెళ్లి కాళ్ళు జారి బావిలో పడింది. అది రాము వస్తూనే చూచాడు. అయ్యో నాయనమ్మ అని అరిచాడు. చుట్టూ ఎవరు లేరు. అప్పటికే బావిలోపల నీళ్లలో పడింది. ఉరికి ఇంట్లో నుంచి పొడుగు తాడు తెచ్చాడు. తాడుకొన బావిలో విసిరాడు. మరొక కొన పైన కట్టాడు. తాడును పట్టుకో నాయనమ్మా అని గట్టిగా పిలిచాడు. భయపడకు నాయనమ్మ అని అరిచాడు. ధైర్యం కోల్పోలేదు. తాడును పట్టుకుంది. ఆ అరుపులకు అందరూ జనం గుమిగూడారు. అయ్యో పాపం ముసలవ్వ అని కొందరు అంటున్నారు. ఎంత పని అయిపాయే అని మరికొందరు అనుకుంటున్నారు. మంచి ముసలవ్వకు గిలాంటి ఆపద వచ్చే అని అనుకున్నారు. బావిలోకి దిగి ముసలవ్వను పైకి తీసారు. అందరినీ చూసింది. రామును చూడగానే ఆనందం పొంగింది. ఆత్మస్థైర్యం వచ్చింది. అయ్యో రాము నాయనా తాడు వేసి కాపాడావు. నిండా నూరేళ్ళు నా ఆయుస్సు కూడా పోసుకొని బతుకు నాయనా అని రాముకు దీవెనలు ఇచ్చింది. అందరు రాము తెలివికి, సమయస్ఫూర్తికి, సాహసానికి మెచ్చుకున్నారు.

- డా॥ వాసరవేణి పరశురాం
m : 94921 93437

ఆట

# సబ్జా విండూర్



**ఎంతమంది పాల్గొనవచ్చు - ముగ్గురు లేదా అయిదుగురు**
**ఎక్కడ ఆడవచ్చు - ఆరు బయట**
**ఈ ఆటకు గల ఇతర పేర్లు - ఐస్ బాయ్**

సజ్జావిండూర్ ఆటలో దొంగను 'పంటలు' పద్ధతి ద్వారా ఎన్నుకోవాలి. దొంగను ఎన్నుకొన్న తరువాత, దొంగ కళ్ళు మూసుకొని అంకెలు లెక్కబెడతాడు.

అతను కళ్ళు తెరిచే లోపు, మిగిలిన అందరూ దొంగకు కనబడకుండా ఎక్కడైనా దాక్కోవాలి. (కొన్ని సరిహద్దుల లోపల) దొంగ, దాక్కున్న ప్రతి ఒక్కరినీ కనుక్కొని, వారి పేరు చెప్తూ 'విండూర్' అని అరవాలి.



ఈ లోపుగా ఎవరైనా దొంగ వెనుకగా వచ్చి 'సబ్జా' అని ముట్టుకొంటే, దొంగ మరల ఆటను మొదలు పెట్టవలసి ఉంటుంది. అలా కాక, దొంగ అందరినీ కనుగొనగలిగితే, మొదటగా విండూర్ అయిన వ్యక్తి తర్వాత ఆటకు దొంగగా ఉండవలసి వస్తుంది.

– 'చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు' నుండి...

# జింక-నత్త



ఒకసారి ఒక జింక, నత్త కలిశాయి. జింక నత్త మెల్లని నడకను చూసి నవ్వుతూ ఇలా అడిగింది, 'నీవు ఇలాగే మెల్ల మెల్లగా నడిస్తే గమ్యాన్ని ఎప్పుడు చేరుకుంటావు?' 'నేను మెల్లగనైనా సరే, నా పని లేదా నా యాత్రను సమయంలో పూర్తి చేసుకుంటా'నని నత్త సమాధానమిచ్చింది. అప్పుడప్పుడు మీలాంటి వారికంటే ముందు కూడా వెళ్లిపోతాను. ఎందుకంటే నేను కష్టపడతాను కాబట్టి. ఓహో! నీకింత అహంకారం, ఇంత గర్వమా! నీవెక్కడికైనా వెళ్లడానికి ఒక రోజు సమయం తీసుకుంటావు కాని అక్కడికి నేను ఒక క్షణములో చేరుకుంటానని జింక చెప్పింది.

"పద, నేను పరుగెత్తుతాను నీవు నన్ను పట్టుకో" అని జింక నత్తతో అన్నది. నత్త తన శక్తి కొద్దీ జింకను పట్టుకోవడానికి పరుగెత్తింది. నత్త నా దగ్గరికి వచ్చేసరికి చాలా సమయం పడుతుంది కదా! అనుకుని జింక తొవ్వలో నిద్రించడం మొదలు పెట్టి, గాఢ నిద్రలోకి వెళ్లిపోయింది.

నత్త వేగంగా పరుగెత్తి జింక మీద ఎక్కి కూర్చుంది. ఎప్పుడైతే జింక నిద్రలేచి నత్తను పిలించిందో నత్త 'హా…' అని పలికింది.

జింక నత్తతో పరుగెత్తి పట్టుకోమని చెప్పి వేగంగా వెళ్లసాగింది. కొద్దిసేపు తర్వాత జింక మళ్లీ నత్తను పిలిచింది. నత్త 'హా…' అని సమాధానమిచ్చింది. జింక ఇంకా వేగంగా పరుగెత్తింది. మళ్లీ నత్తను పిలిచింది, నత్త మళ్లీ 'హా…' అని సమాధానమిచ్చింది. జింక ఇంకా పరుగెత్తింది. ఎంత వేగంగా పరుగెత్తిందంటే దానికి వాంతి అయి పొట్టలోని ప్రేగులన్నీ బయటపడ్డాయి. చివరికి పరిగెత్తలేక ఈ రోజు నీవే గెలిచావని జింక నత్తతో అన్నది. అప్పుడు నత్త జింకతో అన్నది. "గుర్తు పెట్టుకో, ఇతరులను ఎప్పుడు చిన్న చూపు చూడకూడదు, ప్రతి ఒకరికి ఒక రోజు వస్తుంది".

– డా. షేక్ అబ్దుల్ ఘనీ
m : 99481 30168

# బొంతలు




విద్యార్థుల్లో విషయ జ్ఞానమే గాదు ప్రపంచ జ్ఞానం అవసరం. పుస్తకాలకే పరిమితం గాకుండా వివిధ ప్రాంతాలను చూడటం వలన ప్రత్యక్షంగా అనేక విషయాలు తెలుసుకోవచ్చు. వినోదం, వికాసం, విజ్ఞానం పొందవచ్చని భావించి.. ఎక్కడైతే సంఖ్య ఎక్కువుందో, సంఖ్యా పరిమితుల ననుసరించి ప్రభుత్వం విజ్ఞాన యాత్ర కోసం అన్ని విధాలుగా ఏర్పాటు చేసింది. అలాంటి పాఠశాలల్లో రంగాపురం ఒకటి.

మూడు రోజుల విజ్ఞానయాత్ర కోసం రామప్ప, పాకాల, పాపి కొండలు, వరంగల్లు, రామగుండం, కాళేశ్వరం మొదలగు ప్రాంతాల కోసం పదో తరగతి విద్యార్థులు 30 మంది, వారికి గైడ్‌గా నలుగురు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందితో బస్సులో బయలుదేరారు.

తెల్లవారుజామున ముందుగా కాళేశ్వరం చేరుకొని త్రివేణి సంగమం, దేవాలయాలు, అక్కడ నిర్మితమైన జలపథకాలు, నిర్మాణాలు చూసారు. ఆ తర్వాత రామగుండం వెళ్ళి, అక్కడ విద్యుత్ కేంద్రాన్ని దర్శించి రాత్రి కాళేశ్వరం గెస్ట్ హౌజ్‌లో బస చేసారు.

రాత్రి భోజనాలయ్యాక సూచనల మేరకు ఎవరికి వారు తెచ్చుకున్న దుప్పట్లు పరుచుకున్నారు. అందరి దుప్పట్లు, బ్లాంకెట్లు కొన్నవి, ఖరీదైనవి. చాలా రకాల డిజైన్లలో, రంగురంగుల్లో అందంగా ఉన్నవి.

కానీ అందులో మహేశ్ తెచ్చుకున్నవి బొంతలు. అవి పాత చీరలతో, లుంగీలతో, పాత ధోతులతో అందంగా కుట్టారు. వాటిని చూసి మిగతా విద్యార్థులు హేళన చేస్తూ, నవ్వడం మొదలు పెట్టారు. "చీరల్లో పడుకున్నాడు. లుంగీల్లో దాగి ఉన్నాడు..." ఇలా రకరకాలుగా చప్పట్లతో పాటలు పాడటం మొదలు పెట్టారు. పడుకొమ్మని చెబితే పాటలు పాడుతున్నా రేందని, ఉపాధ్యాయులు రాగానే నిశ్శబ్దంగా ఉండిపోయారు. పడుకున్నట్లు నటిస్తున్నారు. కానీ మహేశ్ మాత్రం కూర్చొని ఏడుస్తున్నాడు. దాన్ని చూసి ఉపాధ్యాయులు దగ్గరికి వచ్చి విషయం అర్థం చేసుకొన్నారు. ఇతర విద్యార్థులను కూర్చోబెట్టి, ఇది పద్ధతి కాదు హేళన చేయడం మంచిది కాదు. హేళన చేసే ముందు మీరు ఒకసారి ఆలోచించండి.

వాడు చేసిన తప్పేంటి? మీకు డబ్బులు ఉన్నాయి. మీరేమైనా కొనగలరు. మరివాడికి ఉండాలి కదా..? అని ఒక ఉపాధ్యాయుడు అనగా.. సైన్స్ టీచర్.. "మీరు జాగ్రత్తగా వినండి. వనికిరావన్న వాటితో ఉపయోగించటానికి మరో విధంగా తయారు చేసుకున్నారు. ఒకసారి వాడిందాన్ని మరోసారి.. మరోసారి ఎన్నో విధాలుగా వాడుకోవచ్చు. మార్చుకోవచ్చు. కొద్దిపాటి శ్రమతో ఉన్న దుస్తుల్ని బొంతలుగా కుట్టి, అవసరానికి వాడుకుంటున్నారు. వాటిని పరుచుకున్న, కప్పుకున్న ఎంతో బాగుంటవి. ఉతకడం కూడా సులభం.

మహేశ్ నాయనమ్మ కుట్టిన బొంతలు ఇవి. పెద్ద మనిషి ఆమె. ఎంతో అనుభవం ఉన్నామె. చాలా మంది డబ్బులిచ్చి, పాత దుస్తులతో ఆమెతో ఇలాంటివి కుట్టించుకుంటారు. ఈ కాలంలో కొత్తదుస్తులతో కుట్టుతున్నవి దొరుకుతున్నవి. చాలా ఖరీదు కూడా, ఒక వస్తువు పునర్వినియోగం వలన సమయం, డబ్బు ఆదా అవుతుంది. దాంతో పర్యావరణ పరిరక్షణ కూడా" అని చెప్పగానే, సార్, క్షమించండని వేడుకున్నారు. ఆ తర్వాత నిశ్శబ్దంగా ఉండిపోయారు. మీకు కొన్ని ప్రశ్నలు వేస్తా, సమాధానం చెప్పండి. అనగానే విద్యార్థులు సరేననగా..

"మీ ఇంటికి న్యూస్ పేపర్ వస్తుందా?"

"వస్తుంది సార్", ఏయే పేపర్లు వస్తాయి? అనగానే పేర్లని చెప్పారు. పిల్లలు. "వాటిని ఏం చేస్తారు?"

చదువుతాం, ఏదైనా తీసుకపోవడానికి.. ప్యాకింగ్కి. షెల్ఫ్‌లో బట్టలు పెట్టుకోవటానికి పరుస్తాం.. అప్పుడప్పుడు ప్రాజెక్ట్ వర్క్‌లకు బొమ్మలు కత్తిరిస్తం.. కుట్టు శిక్షణలో కటింగ్ నేర్చుకుంటాం.. కవర్‌లు చేస్తం... రెండుమూడు నెలలకు ఒకసారి అమ్ముతాం.. ఇలా రకరకాల సమాధానాలు వచ్చాయి.

"అవునా? మీరందరూ చాలా తెలివైన వారే. ఒక్క పేపర్‌తో ఇన్ని పనులా..?" "అవును సార్.." అన్నారు ముక్తకంఠంతో.

"అలాంటప్పుడు ఒకసారి వాడిన దాన్ని, మరో రూపంలో వినియోగించుకోవచ్చా?" "వాడుకోవచ్చు సార్"

"గుడ్ పిల్లలూ.. మీలాగే మహేశ్ వాళ్లు చేసారు. మీకు సరియైన అవగాహన ఆలోచన లేకపోవడం వలన ఇలా జరుగుతుంది. ఇకనుంచైనా శ్రద్ధ పెట్టండి. ప్రతీ విషయం పట్ల ఆలోచనతో ఉంటూ అవగాహన పెంచుకోండి." "అలాగే సార్...." అంటూ విషయం అర్థమై క్షమించమన్నట్టు మహేశ్ వైపు చూసారు అందరూ.

**– గరిపెల్లి అశోక్,** మా బడి కతలు నుండి...
m : 9849649101


చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
Bala Chelimi
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**Account Details :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010



# లేపాక్షి

లేపాక్షి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీ సత్యసాయి జిల్లాలో ప్రధాన శైవక్షేత్రం, పర్యాటక కేంద్రం. ఇది సమీప పట్టణమైన హిందూపురం నుండి 14 కి. మీ. దూరంలో ఉంది. బెంగుళూరు నుండి 120 కి.మీ. దూరంలో ఉంటుంది. హైదరాబాదు, బెంగుళూరు రోడ్డుకు ఎడమ వైపు నుండి 11 కి.మీ. దూరంలో ఉంటుంది. ఇక్కడ వున్న వీరభద్ర స్వామి దేవాలయం (లేపాక్షి) నంది ప్రధాన పర్యాటక ఆకర్షణలు. ఇది యునెస్కో వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చోటు చేసుకుంది. రామాయణములో రావణాసురుడు సీతను అపహరించుకుని వెళుతుండగా ఈ కూర్మ పర్వతం పైన జటాయువు అడ్డగిస్తుంది. రావణుడు ఆ పక్షి రెక్కలు నరికివేయగా ఈ స్థలములో పడిపోయినట్లు, ఆ పిమ్మట సీతాన్వేషణలో ఈ స్థలానికి వచ్చిన శ్రీరాముడు జటాయువును చూసి, జరిగిన విషయం తెలుసుకుని, తర్వాత ఆ పక్షికి మోక్షమిచ్చి లే-పక్షీ అని పిలుస్తాడు. లే-పక్షి అను పదమే క్రమ క్రమముగా లేపాక్షి అయినట్లు స్థలపురాణం ద్వారా తెలుస్తుంది. మరో కథనం ప్రకారం అచ్యుతరాయలు కోశాధికారి విరూపణ్ణ రాజు అనుమతి లేకుండా ప్రభుత్వ ధనంతో ఆలయ నిర్మాణం చేపట్టాడు. నిర్మాణం చాలా వరకూ పూర్తై, కళ్యాణ మంటపం నిర్మాణం జరుగుతున్న సమయంలో రాజుగారికి విరూపణ్ణ వ్యతిరేకులు ఈ విషయం గురించి చేరవేసారు. దీంతో విరూపణ్ణ ముందుగానే రాజు విధించబోయే శిక్షను తనకు తానుగా విధించుకుని రెండు కళ్లనూ తీసివేసి కళ్యాణ మంటపం దక్షిణవైపున ఉండే గోడకు విసిరి కొట్టాడట. అలా కళ్లు విసిరికొట్టిన ఆనవాళ్ళుగా అక్కడి గోడపైనుండే ఎర్రటి గుర్తులను స్థానికులు చూపుతుంటారు. అలా లోప-అక్షి (కళ్లు లేని) అనే పదాల ద్వారా ఏర్పడిందే లేపాక్షి అని చెబుతారు. పట్టణ ప్రవేశంలో ఉన్న ఒక తోటలో ఉన్న అతిపెద్ద ఏకశిలా నంది విగ్రహం ఠీవిగా కూర్చున్న భంగిమలో ఉంటుంది. ఇచ్చట గుట్టవంటి ఏకశిలను బసవేశ్వరుడుగా తీర్చిదిద్దారు. ఇంత పెద్ద బసవడు బహుకొద్దిచోట్లమాత్రమే ఉన్నాయి. "లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా" ఈ మాట మనందరం వినే ఉన్నాం. పాతికకు మించిన శిలా స్తంభాలు, నాలుగు వైపులా లతలను చెక్కిన మండపం ఉన్నాయి. ఇలాంటి మండపం ఇతరచోట్ల సామాన్యంగా కనిపించదు. ఈ ఊరు శ్రీ కృష్ణదేవ రాయల కాలములో మిక్కిలి ప్రశస్తి పొందింది. విరుపణ్ణ నాయక, వీరణ్ణ నాయక అను ఇద్దరు గొప్ప వ్యక్తులు ఆ రాయల ప్రతినిధులుగా ఈ ఊరిలో ఉండి ఈ ప్రాంతాన్ని పాలించారు. ఇచ్చటి వీరభద్రుని ఆలయాన్ని సా.శ. 15, 16వ శతాబ్ది మధ్యకాలములో విజయనగర ప్రభువు అచ్యుతరాయల కాలంలో పెనుకొండ సంస్థానంలో కోశాధికారిగా వున్న విరూపణ్ణ కట్టించాడని ప్రతీతి. లేపాక్షి సహజమైన శిల్పాకళా నైపుణ్యంతో పర్యాటకులను ఆహ్లాదపరుస్తుంది. ఈ లేపాక్షి ప్రాంతాన్ని దేశ, విదేశీ పర్యాటకులు సందర్శిస్తుంటారు.

జుగాష్ విలి

నాటిక

# మాయం




రమ్య : ఒరేయ్ రాజూ! రవీ, సునీతా రండిరా రండి మనం అలా వెన్నెల్లోకి వెళ్ళి ఆడుకుందాం.

రాజు : మంచిది! పద ఏదైనా ఓ పాట పాడుతూ వెళ్దాం.

సునీత : అవునవునూ...

రవి : ఆకాశం గొడుగు కింద
ఆటలాడుకుందాము
మన కోసం మనం కలిసి
పాటపాడుకుందాము
చందమామ చెంత చేరి
విందు చేసుకుందాము
వెన్నెలంత గిన్నెలలో
నింపుకొని తాగుదాం...
ఆకాశం....

రవి : అరే చూడండ్రా! ఆకాశం అక్కడలేదు! ఎటుపోయిందిరా!

రమ్య : అమ్మో! ఆకాశం మాయమైంది రా!

రాజు : అవును ఆకాశం మాయమయింది

(అందరూ.. ఆకాశం మాయమయ్యింది)

రమ్య : పారిపోదాం రండి!

రవి : భయం వేస్తుంది...... ఇక్కడ్నుంచి వెళ్ళి పోదాం!

(అందరూ): పారిపోదాం... పారిపోదాం

రాజు : ఎక్కడికిరా?

రమ్య : ఏమో! ఇక్కడున్నుంచైతే వెళ్ళిపోదాం!

రవి : ధైర్యంగా పోదాం! అడవిలోకి పోదాం.

సునీత : ఇక్కడ కంటే అడవే నయం! పరుగెత్తండి! పరుగెత్తండీ

సునీత : భయం! పోయేటట్లు ఒక పాట పాడుదాం!
"అడవిలోకి చేరుదాం
ఆటలెన్నో ఆడుదాం
చెట్టు పుట్ట కలియతిరిగి
పుట్ట తేనె తాగుదాం
నక్కబావ కనిపిస్తే

రాయిపట్టి తరుముదాం
కోతి మనకు ఎదురైతే
కొమ్మలెక్కి కోరుదాం
పులి మనకు కనిపిస్తే...
అమ్మో... పులి మనకు కనిపిస్తే
పిల్లులై పరిగెడదాం....!

(అందరూ): హ.... హ.... హ.... హ....

రవి : హమ్మయ్య అడవిలోకి వచ్చేసాం.

రాజు : ఇక్కడి చెట్లు ఏవిరా!

రమ్య : ఒక్క చెట్టూ కనిపించడంలేదు.

సునీత : కొంపదీసి అడవి మాయం కాలేదు కదా!

రమ్య : మనం తినడానికి పండ్లు, కాయలు వుండవా!

సునీత : తిండిపోతా! అసలు అడవి లేకపోతే మనం బ్రతుకుతామా?

రవి : చెట్లు లేకుంటే గాలి వుండదు.

రమ్య : గాలి లేకపోతే ప్రాణమే నిలువదు.

రాజు : నిజమేరా అడవీ మాయమైంది.

(అందరూ): (భయంతో) అడవీ మాయమైంది.
అడవీ మాయమైంది)

రవి : పరుగెత్తండోయ్! పరుగెత్తండీ ఇక్కడుంటే చస్తాం.

రమ్య : నీతో పరుగెత్తలేక చస్తూనే వున్నాం... ఇప్పుడు ఎక్కడికిరా?

సునీత : ఏమో! బాబూ ఈ పరుగులు ఎక్కడికో ఏమో!

రాజు : ఇంకెక్కడికి... కనీసం మనం నిలబడ్డామంటే "భూమి కారణం"... ఇదైనా ఉంది సంతోషం.

రవి : భూమికి ఒక పాట పాడుదామా!

సునీత : పాడండీ భయమన్నా పోతుంది.

(అందరూ): "వందనం వందనం
భూమి తల్లికి వందనం
వందనం అభివందనం
అమృతవల్లికి వందనం"

రమ్య : అయ్యో! అయ్యయ్యో నేను పడిపోతున్నాను.

రాజు : కాళ్ళ కింద భూమి కదులుతుందిరా!

రవి : గాలిలో తేలుతున్నట్టుంది.

రమ్య : నేను మా ఇంటికి పోవాలి.

రవి : భూమి కనిపించడం లేదు.

(అందరూ): భూమి మాయమైంది.
భూమి మాయమైంది.

నిద్రలో కలవరింత రాజు : ఆకాశం మాయమైంది
అడవీ మాయమైంది
భూమి మాయమైంది ॥2॥

తాతయ్య : ఓరేయ్! రాజు ఏమిట్రా నిద్రలో ఆ కలవరింత కలగన్నావా ఏమి లేరా లే...

రాజు : అవునా తాతయ్య! ఇది కలనా? అమ్మో ఎంత భయం వేసిందో? నిజంగా కలనే కదూ!

తాతయ్య : ఆ కలలో ఏమి చూసావురా? అంత భయపడుతున్నావు?

రాజు : నువ్వు రాత్రి చెప్పిన కబుర్లు వింటూ నిద్రపోయాను, అంతలో ఓ భయంకరమైన కల వచ్చింది తాతయ్యా.

తాతయ్య: ఏమి చూసావురా!

రాజు: ఆకాశం, అడవీ, భూమి మూడూ మాయమయినట్లు ఓ భయంకరమైన కల

వచ్చింది. నేను నా ఫ్రెండ్స్ భయంతో అటూ ఇటూ పరుగెత్తాం.

తాతయ్య: రాజూ ఇప్పుడు ఇది కలనే! కాని రేపటి నిజం!

రాజు : అదెట్లా?

తాతయ్య: అవునూ! మనం మనుషులం! భూమి మీద కాలుష్యాన్ని పెంచుకుంటూపోతే ఏదో ఒక రోజు ఆకాశం మాయమవు తుంది! మన అవసరాల కోసం అడవులను నరుక్కుంటూ పోతే, అడవీ మాయ మవుతుంది! జనాభాను ఇలాగే పెంచు కుంటూ పోతే భూమి మాయమవుతుంది.

రాజు: మరి మనం, ఏమేం చేయాలి తాతయ్యా?

తాతయ్య: కాలుష్యం రగిలించే వాహనాలను తగ్గించాలి!
చెట్లను నరకవద్దు! పెంచాలి!
జనాభాను నియంత్రణలో ఉంచుకోవాలి!
లేకపోతే నీకు వచ్చిన
కల నిజమవుతుంది.

(అందరూ): తస్మాత్ జాగ్రత్త... తస్మాత్ జాగ్రత్త...

(ఈ నాటిక నిజామాబాద్ ఆకాశవాణి ఎఫ్.ఎమ్. రేడియో కేంద్రం నుండి ప్రసారమైనది)

(ఈ నాటిక నిజామాబాద్ బాల సాహిత్య మాస పత్రిక "ఇందూరు బాల"లో ప్రచురితమైనది)

– డా॥ కాసర్ల నరేశ్‌రావు
m : 94414 06252



# వేమన పద్యాలు

**ఎలుక తోలు దెచ్చి యేడాది యుతికిన**
**నలుపు నలుపెగాని తెలుపు రాదు**
**కొయ్యబొమ్మను దెచ్చి కొట్టిన బలుకునా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

ఎలుక తోలు నల్లగా ఉంటుంది. ఎంత శుభ్రంగా చేసినా దాని రంగు మారదు. నలుపు పోయి తెలుగు రంగు రాదు. అలాగే ప్రాణం లేని కొయ్య బొమ్మను తెచ్చి ఎంత కొట్టినా అది మాత్రం మాట్లాడలేదు. అంటే స్వతహాగా ఉండే స్వభావం అంత సులభంగా మారదని అర్థం.

**ముష్టి వేపచెట్లు మొదలంటు ప్రజలకు**
**బరగ మూలికలకు బనికి వచ్చు**
**నిర్దయాత్మకుండు నీచుడెందులకౌను**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

ఎందుకూ పనికి రావని భావించే ముష్టి చెట్లు, నిలువెల్లా చేదు నిండిన వేపచెట్లూ మనకు ఔషధాలుగా, మూలికలుగా ఉపయోగ పడతాయి. దయాదాక్షిణ్యాలు లేని రాతి గుండె మనిషి ఎందుకు ఉపయోగపడతాడు?



# విజేత




తిరగవేస్తే మోత
మురగవేస్తే రోత
కత్తిరిస్తే కోత
ఘీంకరిస్తే ఘాత
కింకరిస్తే వాత
ఎన్నికయితే నేత
ఆడి గెలిస్తే విజేత..!

# బొట్లు పెట్లు



అద్దిపెట్టు కుంకుమ బొట్టు
దిద్ది పెట్టు కాటుక బొట్టు
ముంచిపెట్టు తిలకం బొట్టు
పంచిపెట్టు పసుపు బొట్టు
చూచిపెట్టు చుక్క బొట్టు
ఊదిపెట్టు ఊదు బొట్టు
సాదిపెట్టు సాదు బొట్టు
కలిపిపెట్టు చంద్రం బొట్టు
పొడిసిపెట్టు పచ్చ బొట్టు
తీసిపెట్టు బొట్టు బిళ్ళ
దిష్టిబొట్టు బుగ్గ మీద
చంద్రవంక నుదిటి మీద..!

– గంగదేవు యాదయ్య,
m : 9059112105, (ఉయ్యాలా జంపాలా బుజ్జి పాటలు నుండి)

# తంగేడు చెట్టు

ప్రకృతిలో దొరికే ప్రతిదీ జీవకోటి మనుగడకు ఆధారం. మన చుట్టూ ఉండే అనేక రకాల చెట్లల్లో ఎన్నో ప్రయోజనాలు దాగి ఉన్నాయి. మన శరీరంలో వచ్చే అనేక రకాల రోగాలను తగ్గించే ఆయుర్వేద గుణాలు కలిగి ఉన్నాయి. అటువంటి కోవకు చెందినదే తంగేడు చెట్టు. తంగేడు చెట్టును ఆత్మ గౌరవంగా తెలంగాణ ప్రజలు భావిస్తారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పుష్పంగా తంగేడు పువ్వును ప్రకటించింది. బతుకమ్మ పండుగలో తంగేడు పూలదే అగ్రస్థానం. తంగేడు చెట్టు పరిణామంలో చిన్నదే కానీ ఉపయోగంలో దిట్ట. నీటి ఎద్దడిని తట్టుకునే చెట్టు తంగేడు. ఆకుపచ్చని ఆకులు కలిగి, గుత్తులు గుత్తులుగా మదిని దోచే బంగారు పూలు పూయడం ఈ చెట్టు యొక్క ప్రత్యేకత.

వ్యవసాయ రైతులు తమ పొలాలలో దీని ఆకులను వేసి సేంద్రియ ఎరువుగా వాడుతారు. దీని బెరడును లందలో నానబెట్టి తోళ్లను శుభ్రం చేస్తారు. ఇంతే కాదు తంగేడు చెట్టు ఎన్నో ఔషధ గుణాలు కూడా కలిగి ఉంది.

**తంగేడు చెట్టు ఉపయోగాలు :**

- తంగేడు చెట్టు యొక్క వేర్లను కషాయం కాచుకొని తాగితే నీళ్ల విరోచనాలు తగ్గుతాయి.
- తంగేడు బెరడు రసాన్ని రోజుకు ఒకసారి మూడు రోజులు తాగితే ట్రాన్సిల్స్ సమస్య తొలగిపోతుంది.
- దీని లేత ఆకులు నమిలి మింగితే దగ్గు తగ్గుతుంది.
- ఆకులను నీడలో ఎండబెట్టి ఆ చూర్ణాన్ని గోరు వెచ్చటి నీటిలో రోజు తీసుకోవడం వలన మలబద్ధకం తగ్గుతుంది.



- దీని లేత చిగుళ్ళను మెత్తగా నూరి పెరుగులో కలుపుకుని పరిగడుపున తాగితే నీళ్ల విరోచనాలు తగ్గుతాయి.
- తంగేడు చిగుళ్ళను మజ్జిగలో నూరి పాదాల మడమలకు రాస్తే కాలి పగుళ్లు తగ్గుతాయి.
- మూత్రం సరిగ్గా రానప్పుడు తంగేడు పువ్వులతో కషాయం పెట్టి దానిలో చక్కర చేర్చి తాగితే మూత్రం బయటకు సులువుగా వస్తుంది.
- విత్తనాల చూర్ణం మూడు గ్రాములు తీసుకుని తేనె కలిపి తాగితే అతి మూత్రం తగ్గుతుంది.
- తంగేడు చెట్టు యొక్క లేత చిగుళ్ళను మాడ మీద వేసి గట్టిగా తలకు బట్ట కట్టిన యెడల తలపోటు తలనొప్పి నయం అవుతుంది. అంతేకాకుండా నేత్ర రోగాలు నివారించబడతాయి.

తంగేడు చెట్టు రాను రాను కనుమరుగు అయ్యే ప్రమాదంలో పడింది. పర్యావరణ ప్రేమికులుగా మనందరం తంగేడు చెట్ల వనాలను సంరక్షించే బాధ్యత చేపడతాం. ప్రకృతిని పచ్చగా ఉండనిద్దాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655

కవిత

# డాబా మీద జ్ఞాపకాలు

చూడు చూడు చుక్కలు
చక్కనైన చుక్కలు
నింగిలోన మిలమిల
మెరిసేటి తారకలు

గుంపుగా ఉంటాయి
చెదరిపోయి ఉంటాయి
ఎంచక్కా మనసులు
రంజింపజేస్తాయి

చుక్కల రాత్రుల్లో
ఎంతో హాయి! హాయి!
గగనంలో వింతలు
గాంచునోయ్! కనుదోయి!

మా ఇంటి డాబాపై
ప్రతి రాత్రి వేడుకలు
కథలు, కబుర్లతో
ఉల్లసించు వీనులు

- గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580



పంచతంత్ర కథలు

# రాజుగారి పెంపుడు కోతి



ఒక రాజుగారు ఒక కోతిని పెంచారు. ఆయన దానిని చాలా ప్రేమగా చూసుకునేవాడు. అది రాజుగారి అంతఃపురం అంతా తిరుగుతూ ఉండేది. రాజుగారు దానికి మంచి వేషం వేయించేవారు. ఒక కత్తిని కూడా దానికి ఇప్పించారు. అది ఆ కత్తిని పట్టుకుని ఒక సైనికుడిలా ఠీవిగా నడుస్తూ ఉండేది.

ఒకరోజు మధ్యాహ్నం ఆ రాజుగారు నిద్ర పోతున్నారు. ఆ కోతి విసెనకర్రతో విసరసాగింది. అప్పుడు ఒక ఈగ అక్కడికి వచ్చి, రాజుగారి మీద వాలింది. కోతి దానిని తోలి వేసింది. కాని ఆ ఈగ మళ్ళీ మళ్ళీ రాజుగారి మీద వాలసాగింది. ఆ కోతి ఎంత తోలినా ప్రయోజనం లేకపోయింది. చివరికి ఆ కోతి విసిగిపోయి, ఆ ఈగని ఎలాగైనా సరే చంపాలనుకుంది. ఈసారి ఆ ఈగ రాజుగారి మేడ మీద వాలింది. వెంటనే ఆ కోతి దానిని చంపడానికి కత్తితో బలంగా ఒక వేటు వేసింది. ఆ దెబ్బకు ఈగ చావలేదు కానీ రాజుగారి ప్రాణం పోయింది.

**నీతి: తెలివితక్కువ వాళ్ళని, జంతువుల్ని చేరదీసినప్పుడు వాటితో కలగబోయే ప్రమాదాన్ని గుర్తించి మెలకువతో ఉండాలి. మూర్ఖుడైన మిత్రుని కంటే తెలివైన శత్రువే మెరుగు.**

కార్టూన్ కథ

# పెళ్ళి చేసుకోడానికి చాలా చిన్న వయస్సు

పన్నెండేళ్ళ ప్రియ టీచర్ కావాలని కల కనింది. కానీ, ఆమె తల్లిదండ్రులు వేరే ప్రణాళికలు వేస్తున్నారు. ఆమెకు పెళ్ళి చేయాలని నిర్ణయించుకున్నారు.




ఆడపిల్లలకు వయస్సు రాకముందే పెళ్ళి చేయడం చట్ట విరుద్ధమని మన టీచర్ అక్క చెప్పింది. నీకు గుర్తుందా?
కాని మన క్లాస్‌మేట్ మీనా కూడా పెళ్ళి చేసుకోబోతుంది
ప్రియా మరియు నతి బడికి చేరుకున్నారు. కొందరు విద్యార్థులు పాఠశాల బయట నిలబడి మాట్లాడుకుంటున్నారు.
రంజు, ఇక్కడ ఏమి జరుగుతోంది?
ఈ రోజు పాఠాలు జరగవు. మీనా పెళ్ళి ఆపేందుకు టీచర్ అక్క పోలీసు వారితో వెళ్లింది.
అక్క అలా చేయగలరా?
తక్కువ వయస్సు ఉన్న అమ్మాయికి పెళ్ళి జరుగుతుందని తెలిస్తే పోలీసు వారికి చెప్పవచ్చు.
తల్లిదండ్రులను అరెస్టు చేయవచ్చు.
రా, నాతి. ఇంటికి వెళ్దాం. నేను నా తల్లిదండ్రులతో మాట్లాడాలి.

## కార్టూన్ కథ




**భారతదేశంలో, బాల్య వివాహాల నిషేధ చట్టం, 2006 చట్టం ద్వారా బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి.**


సిహెచ్. మాహిక, 9వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హై స్కూల్

కథ

# చెట్టే కోపిస్తే




నరసింహపురంలో రామయ్య, భూషయ్య అను ఇద్దరు మిత్రులు ఉండేవారు. వారిలో రామయ్య వృక్ష ప్రేమికుడు. భూషయ్యకు చెట్లంటే మహా చిరాకు. అతడు ఎక్కడ మొక్క ఉన్నా దాన్ని కోపంతో పీకి బయట పడవేసేవాడు. ఈ సంగతి రామయ్యకు తెలియదు.

ఒకరోజు ఇద్దరూ కలిసి పొరుగూరు చేమంతి పురానికి కాలి నడకన బయలు దేరారు. అక్కడ దారి వెంబడి ఊరి గ్రామస్తులు కొన్ని మొక్కలు నాటారు. అవి కొంచెం పెద్దగా పెరిగాయి. వాటికి కంచెలను కూడా వారు ఏర్పాటు చేశారు. అలా వారు వెళ్లేటప్పుడు ఒక మొక్క దగ్గర పెట్టిన కంచెను ఏవో జంతువులు పాడు చేయడం చూశారు. అది భూషయ్యకు కనిపించింది. ఆ కంచె లోపల ఒక మొక్క కూడా కనిపించింది. వెంటనే అతడు రామయ్య చూస్తుండగానే ఆ మొక్కను పీకి ఆ రహదారి పక్కన పడవేశాడు.

రామయ్య అది గమనించి అతనిని "నీవు చేసిన పని ఏమీ బాగాలేదు. అది నిన్ను ఏమంది! అది పెరిగితే పది మందికి నీడనిస్తుంది" అని మందలించాడు. అప్పుడు భూషయ్య "ఏంటి మిత్రమా! నీవు కూడా అందరిలాగే మొక్కలకు వత్తాసు పలుకుతున్నావు. ఆ మొక్కను పీకితే అది మనను తిడుతుందా! కొడుతుందా!" అని నవ్వాడు. అప్పుడు రామయ్య "అవి మనకు చాలా మంచిని చేసేవి. ప్రాణ వాయువును మనకు అందించేవి. మన కడుపు నింపేవి. మనకు చల్లని గాలిని ఇచ్చి సేవ చేసేవి. అటువంటి వాటిని నీవు పీకవద్దు" అని అన్నాడు.

ఇంతలో మధ్యాహ్నం ఎండ కాస్త ఎక్కువ కావడంతో వారు దారిలో విశ్రాంతికని కొద్దిసేపు ఒక ఎండిన చెట్టు కింద ఆగారు. అక్కడ ఆ ఎండిన చెట్టు తప్ప మరే చెట్టు లేదు. ఇంతలో ఒక ఎండిన కొమ్మ విరిగి టపీమని ఆ భూషయ్య తలపై పడింది. అతడు 'అబ్బా' అని తల పట్టుకున్నాడు. అప్పుడు "రామయ్య చూశావా భూషయ్యా! ఇప్పుడు నువ్వు చేసిన ఆ వెధవ పనికి దానికి కోపం వచ్చి అది నిన్ను శిక్షించింది" అని అన్నాడు. అది విని భూషయ్య "నీవు చెప్పినదే నిజమైతే

నేను మరొక మొక్కను కూడా పీకుతాను. అప్పుడు కూడా ఈ చెట్టు నన్ను శిక్షిస్తుందో! లేదో చూస్తాను” అని అన్నాడు.

ఆతర్వాత వారిద్దరూ తిరిగి బయలుదేరారు. రామయ్య వద్దన్నా వినకుండా భూషయ్య దారి ప్రక్కనే ఉన్న మరొక మొక్కను పీకి రహదారి బయట పడవేశాడు. ఆ తర్వాత “ఇక నన్ను ఏ చెట్టు శిక్షిస్తుందో చూస్తాను” అని అన్నాడు. రామయ్య అది విని ఊరుకున్నాడు తప్ప ఏమీ మాట్లాడలేదు.

వారు కొద్ది దూరం వెళ్లేసరికి వారికి ఆకలి అయింది. అక్కడ ఒక పండ్ల చెట్టు కనిపించింది. దాని నిండా పండ్లు ఉన్నాయి. కానీ వారిద్దరికీ ఆ చెట్టును ఎక్కడం రాదు. ఎవరైనా మనుషులు వస్తున్నారేమోనని వారు చుట్టూ చూశారు. కానీ వారికి ఎవరూ కనిపించలేదు. ఇంతలో ఆ చెట్టు కింద చేరిన భూషయ్య తలపైన ఒక చిన్న కాయ టపీమని పడి అతని తల బొప్పి కట్టింది. రామయ్య ముందర ఒక పెద్ద పండు పడింది. రామయ్య దానిని తీసుకుని నవ్వుతూ “చూశావా భూషయ్యా! ఈ చెట్టు నాకేమో తన పండుని ఇచ్చింది. నీకేమో తలపై మొట్టికాయను ఇచ్చింది. ఇప్పుడైనా అర్థమైందా? నీవు చేసిన ఆ వెధవ పనికి ఆ చెట్టుకు కోపం వచ్చింది. అందుకే అలా చేసింది” అంటూ నవ్వాడు. వారు ఎంతసేపు చూసినా ఒక్క పండు కూడా ఆ చెట్టు తిరిగి రాల్చలేదు.

ఆ ఆకలితోనే భూషయ్య రామయ్యతో పాటు బయలుదేరాడు. అతనికి కోపం ఎక్కువై “ఇదిగో రామయ్యా! మళ్ళీ ఈ మొక్కను పీకి పడవేస్తున్నాను. ఇప్పుడు అది ఏం శిక్షను విధిస్తుందో నేను చూస్తాను” అని మరొక మొక్కను పీకి బయటపడవేసాడు. ఆ తర్వాత వారు ఎండ కాస్త ఎక్కువ అవ్వడంతో ఒక మఱ్ఱి చెట్టు నీడలో విశ్రాంతి కొరకు వెళ్లి దాని కింద నిలిచి ఉన్నారు. భూషయ్య ఆ చెట్టు తనను శిక్షిస్తుందే మోనన్న భయంతో కొమ్మలపైకి చూడసాగాడు. ఇంతలో ఆకస్మికంగా వీచిన సుడి గాలికి ఆ మఱ్ఱిఊడ ఊగి భూషయ్యను ఒక్క తోపు తోసింది. భూషయ్య అక్కడనే పట్టు తప్పి కింద పడ్డాడు.

అప్పుడు రామయ్య నవ్వి “చూశావా భూషయ్యా! ఇప్పుడు కూడా చెట్టుకు కోపం వచ్చి నిన్ను శిక్షించింది. నీవేమో జాగ్రత్తపడి పైకి చూస్తున్నావు. అది తన ఊడతో నిన్ను తోసేసింది. ఇప్పటికైనా నా మాటను విను. దానికి నీవు మంచి చేస్తే అది నీకు మంచి చేస్తుంది” అని అన్నాడు. వెంటనే భూషయ్య “రామయ్యా! నువ్వు చెప్పింది అక్షరాల నిజమని నాకు ఎందుకో అనిపిస్తున్నది. ఇప్పుడు నేను మొక్కను నాటి చూస్తాను. నీ మాట ప్రకారం నాకు అవి మేలు చేస్తాయని అనుకుంటున్నాను” అని అక్కడ కోతులు పీకి పడవేసిన ఒక మొక్కను తీసుకొని కొంచెం నేలను తవ్వి దానిని నాటాడు. తర్వాత అక్కడ బావిలోని నీటిని తెచ్చి ఆ మొక్కకు పోశాడు. ఆ తర్వాత ఆ ఆకలితోనే అతడు బయలుదేరాడు.

మళ్ళీ కొద్ది దూరంలో వారికి మరొక పండ్ల చెట్టు కనిపించింది. వారు దాని క్రింద ఆగారు. అప్పుడు అక్కడ అనేక పండ్లు కింద పడ్డాయి. ఈసారి భూషయ్య తలపై ఒక్క పండు కూడా పడలేదు. భూషయ్య ఆకలితో ఆ పండ్లను తిన్నాడు. అతడు సంతోషంతో “మిత్రమా! నీవు చెప్పింది నిజమే! నేను రేపటి నుండి మొక్కలను నాటుతాను” అని అన్నాడు. కాకతాళీయంగా జరిగిన సంఘటనల వల్ల అతనిలో ఈ మంచి మార్పు వచ్చినందుకు రామయ్య ఎంతో సంతోషించాడు. ఆ తర్వాత రామయ్య అతనిలో ఈ మార్పు కలుగ జేసినందుకు ఆ చెట్లకు తన మనస్సులోనే ఒక దండం పెట్టుకున్నాడు.

– సంగన్నభట్ల చిన్నరామకృష్ణ
m : 99085 54535

# నాట్యం చేసే సబ్బు బుడగలు



సబ్బు బుడగలను తయారు చేసే పద్ధతి అందరికీ తెలిసినదే. చిక్కని సబ్బు ద్రవంలో బొబ్బాసి గొట్టం ముంచి, గొట్టపు రెండో కొన నోట్లో పెట్టుకొని నెమ్మదిగా ఊదితే సబ్బు బుడగలు తయారవుతాయి. ఈ బుడగల చేత నాట్యం చేయించే కిటుకు ఒకటి ఉంది. అదిప్పుడు మీకు చెపుతాను.

లోతైన విశాలమైన గాజు గిన్నెలో నాలుగైదు చెమ్చాల కార్బన్ టెట్రా క్లోరైడ్ ద్రవం పోసి, ఆ గిన్నెను వేడి నీళ్ళు పోసిన పళ్లెంలో ఉంచాలి. ఐదు పది నిముషాలు పోయాక ఆ గాజుగిన్నె లోకి మూడు నాలుగు సబ్బు బుడగలు నింపాదిగా విడిచి ఏమౌతుందో చూడండి. ఆ సబ్బు బుడగలు పైకీ, కిందికి తమాషాగా నాట్యం చేస్తాయి. సబ్బు బుడగలు తేలిక అయినప్పటికీ గాలికన్నా బరువైనవి కావడం చేత నిశ్చలమైన గాలిలో నెమ్మదిగా కిందికి దిగుతాయి. కాని, కార్బన్ టెట్రాక్లోరైడ్ ఆవిరి గాలికన్నా సుమారు. ఐదు రెట్లు బరువైనది కావడం చేత గాలితో నిండిన సబ్బు బుడగలు ఈ ఆవిరిలో పైకి తేలు తాయి. హైడ్రోజన్ నింపిన రబ్బరు బుడగలు గాలిలో పైకి తేలినట్లే. అయితే గాజు గిన్నెలో మట్టు దగ్గర ఈ ఆవిరి ఎక్కువ దట్టంగానూ, పైకి వెళ్ళినకొద్దీ పలుచ గానూ ఉండటం చేత సబ్బు బుడగలు కిందికి దిగుతూ మట్టు దగ్గరకి రాగానే కనిపించని చిత్రమైన 'కుషన్' ఏదో ఉన్నట్లు పైకి గెంటబడతాయి. బుడగలు పైకి వెళ్ళిన కొద్దీ వాటి బరువును నిలబెట్టగలిగినంత దట్టమైన ఆవిరి లేకపోవడం చేత అవి మళ్ళీ కిందికి దిగుతాయి.

గాజు గిన్నెలోని కార్బన్ టెట్రా క్లోరైడ్ పూర్తిగా ఆవిరి అయిపోయేదాక సబ్బు ఈ విధంగా నృత్య వినోదంతో చూస్తున్న వారికి కాలక్షేపం కలిగిస్తాయి. వచ్చేనెల ఇంకో సైన్సు సరదా చెప్తాను.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

కథ

# గాలిపటం



యువన్ వాళ్ళ అమ్మమ్మ వాళ్ళ వూరికి వచ్చాడు. ప్రతీ సంవత్సరం సెలవులకు అమ్మమ్మ వాళ్ళ వూరికి వచ్చి గడపటం ఒక ఆనవాయితీ. "సిటీ" నుంచి ఈ పల్లెటూరుకు వచ్చినపుడు ఎంత ఆనందంగా ఉంటుందో! ఎంత హాయిగా, స్వేచ్ఛగా ఉంటుందో! తన చిన్ననాటి పాత మిత్రులంతా తాను రాగానే ఒక్కసారిగా వచ్చేస్తారు. ఉదయం నుంచి రాత్రి దాకా ఒకటే ఆటలే ఆటలు. ఎక్కడా విరామం ఉండదు. అన్నం తినేటప్పుడు తప్ప.

ఈసారి తన కొత్త సైకిలు, స్కేటింగ్ బోర్డ్ తెచ్చుకున్నాడు. అమ్మమ్మ వాళ్ళింటి చుట్టూ పొలాలు, ఖాళీ స్థలాలే. హాయిగా ఆడుకోవచ్చు. అడ్డుచెప్పేవాళ్ళే ఉండరు. అమ్మమ్మకు సమయానికి వచ్చి తినిపోతే చాలు. తాతయ్య సరే సరి, మేం చేసే అన్నీ అల్లరి పనులకు వంత పాడుతారు. పిల్లలుగాక ఎవరు గలభా చేస్తారు అంటారు. తాతయ్య రిటైర్డ్ టీచర్. తాను వచ్చినప్పుడల్లా ఏదో ఒక కొత్త విషయం నేర్పిస్తూ వుంటారు. ఒకసారి బొమ్మలు వేయటం, పెయింటింగ్ చేయటం నేర్పించారు. వాటికి కావలసిన సరంజామా అంతా తెచ్చిపెట్టేస్తారు. తనకు సైకిలు తొక్కడం కూడా తాతయ్యే నేర్పించింది.

తాటి ముంజలు, అప్పుడే తోట నుండి కోసుకొచ్చిన మామిడి పండ్లు తినటం తనకు భలే మాజాగా ఉంటుంది. అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో బ్రౌని కుక్క ఒకటి ఉంటుంది. అది నాలుగో తరం కుక్క అని చెప్తుంటారు తాతయ్య. అది "స్ట్రీట్ డాగ్" అయినా, అరుస్తుంది కానీ ఎవ్వరిని కరవదు. అది పాలన్నం, బిస్కెట్లు మాత్రమే తింటుంది. ఠంచనుగా అమ్మమ్మ దానికి పాలన్నం పెడుతుంది. నేనేమో బిస్కెట్లు పెడుతుంటాను. ఇక్కడ ఉంటే రోజంతా సందడే సందడి.

"కొంచెంసేపన్నా రెస్టు తీసుకో, అలసిపోతావు" అంటుంది అమ్మమ్మ. ఊహూ.. అసలు రెస్టే ఉండదు.

తాతయ్య గాలిపటాలు భలే తయారు చేస్తారు. నా ఫ్రెండ్స్ అందరికీ తలా ఒకటి తయారు చేసి ఇస్తారు. గాలిపటం సూత్రం భలే కడతారు. తోక ఎంత ఉండాలో తాతయ్యకు బాగా తెలుసు. తాతయ్య చేసిన గాలిపటం ఎగరేయగానే, రివ్వున గాలిలో పైకి ఎగిరిపోతుంది. తాతయ్య న్యూస్ పేపర్ తో, రంగు రంగుల కాగితాలతో గాలిపటాలను తయారు చేస్తారు. తాతయ్య గాలిపటం చేస్తుంటే చూడటం తనకు భలే ఇష్టం. ఎంతో శ్రద్ధగా తయారు చేస్తారు తాతయ్య. "ఈ సారి ఎలాగైనా గాలిపటం చేయడం, సూత్రం కట్టడం బాగా నేర్చుకోవాలి."



"తాతయ్య ఈ సారి పెద్ద గాలిపటాలు ఎలా తయారు చేయాలో నేర్పించండి." తాతయ్యకు హుకుం జారీ చేశాడు యువన్. "ప్రతీ సారి చూస్తున్నావు కదా? సరేలే ఈ సారి జాగ్రత్తగా నేర్చుకో."

"మా స్కూల్లో ప్రతీ సంవత్సరం "కైట్ ఫెస్టివల్' జరుపుతారు. నేను ఈ సంవత్సరం ఐదవ తరగతికి వచ్చాను కదా, ఈ సంవత్సరం నేను పాల్గొనొచ్చు. ఈ సారి నేను కప్పు గెలవాలి."

"తప్పకుండా, అయితే ఈ రోజే బజారుకు వెళ్ళి రంగు కాగితాలు, మాంజా దారం తెచ్చుకుందాం."

ఆరోజే బజారుకు వెళ్ళి రంగు రంగుల కాగితాలు, మాంజా దారం తెచ్చుకున్నాం. ఇంకేముంది. తాతయ్య రకరకాల రంగులతో, రకరకాల ఆకారాల్లో చిన్నవి, పెద్దవి గాలిపటాలు తయారు చేయడం చూపించారు. వాటికి సూత్రం కట్టడం ఒక పెద్ద లెక్కే! గాలిపటం సైజును బట్టి, ఆకారాన్ని బట్టి సూత్రం మార్చాలి. ఎన్ని అందమైన గాలిపటాలు తయారయ్యాయో! రోజుకొక కొత్త రకం గాలిపటం తయారు చేయడం నేర్పించారు తాతయ్య. సూత్రం తననే కట్టమన్నారు. నాకు ఇప్పుడు అందంగా గాలిపటాలు ఎలా తయారు చేయాలో వచ్చేసింది. సూత్రం ఎలా కట్టాలో వచ్చేసింది. నేను చేసిన గాలిపటం కూడా రివ్వున ఆకాశంలో ఎగిరి పోతోంది.

అసలు గాలిపటం అలా గాలిలో ఎగరడానికి వెనుక ఉన్న శాస్త్రీయ విషయం తాతయ్య వివరించేసరికి, ఆశ్చర్య పోయాను. ఎవ్వరూ ఈ విషయం ఇంతవరకు చెప్పలేదు. గాలిపటం కూడా న్యూటన్ మూడు నియమాలను అనుసరించి, ఏరో డైనమిక్ ఆకారాన్ని బట్టి గాలిలో ఎగురుతుందని చెప్పారు. గురుత్వాకర్షణ శక్తికి వ్యతిరేక దిశలో, గాలిపటం క్రింద ఉండే గాలి, గాలిపటాన్ని పైకి నెడుతుందని చెప్పారు. గాలి వేగాన్ని బట్టి, మన చేతిలోని దారం, గాలిపటం మధ్య కోణాన్ని బట్టి, గాలిపటం పైకి దూసుకొని పోతుందని చెప్పారు. దారాన్ని క్రిందకు లాగేకొద్దీ, గాలిపటం పైకి వెళ్ళి, గాలిలో స్థిరంగా నిలబడుతుందని చెప్పారు. విమానం, హెలికాప్టర్ ఇదే సూత్రాన్ని అనుసరించి గాలిలో ఎగురుతాయని వివరంగా చెప్పారు. తాతయ్య దగ్గర ఈ సారి ఎన్ని విషయాలు నేర్చుకున్నానో!

అప్పుడే ఇరవై రోజులు గడిచిపోయాయి. నాన్న వచ్చి నన్ను తీసుకొని వెళతానన్నారు. అమ్మమ్మ, తాతయ్యల ప్రేమ, పాత మిత్రుల అభిమానం, ఈ వూరు పరిసరాలు వదలి పోవాలంటే దిగులేస్తుంది. అయినా తప్పదు. మళ్ళీ వచ్చే సెలవుల కోసం ఎదురు చూడాల్సిందే!

అమ్మమ్మ వాళ్ళ వూరినుంచి వచ్చి అప్పుడే మూడు నెలలు దాటి పోయింది. స్కూలు, ఉరుకులు, పరుగులతో కాలం గడచిపోయింది. స్కూలు వాళ్ళు ప్రతీ సంవత్సరం లాగే "కైట్ ఫెస్టివల్" ను ప్రకటించారు. జూనియర్ విభాగం క్రింద నేను పేరిచ్చాను. ఆ రోజు రానే వచ్చింది. తాతయ్య నేర్పించినట్లు పెద్ద సైజు పక్షి ఆకారంలో గాలిపటం తయారు చేశాను. దానికి తాతయ్య చెప్పిన లెక్కల ప్రకారం సూత్రం కట్టాను. ఒక్క సారి గాలిలో ఎగరేశాను. అంతే, నా గాలిపటం రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయింది. నాతోపాటు పది మంది పోటీలో పాల్గొన్నారు. నా ఫ్రెండ్స్ 'యువన్''..... 'యువన్''..... అంటూ చప్పట్లు కొడుతున్నారు. అందరికంటే నా గాలిపటమే ఎత్తుకు ఎగిరింది. మా క్లాసు టీచర్లు చప్పట్లు కొట్టారు. పి.ఇ.టి. శేఖర్ మాస్టారు నన్ను విజేతగా ప్రకటించారు. నాకు మొదటి బహుమతిగా పెద్ద కప్పు, సర్టిఫికెట్ ఇచ్చారు. ఆ తరువాత నన్ను మాట్లాడమన్నారు. గాలిపటం వెనుక ఉండే సైంటిఫిక్ సూత్రాన్ని వివరించాను. చప్పట్లతో మా గ్రౌండ్ మారు మ్రోగింది. వెంటనే వెళ్ళి తాతయ్యకు ఫోను చేసి చెప్పాలనిపించింది. ఇది తాతయ్య నేర్పించిన ఫలితమే కదా, అనుకుంటూ, మనసులోనే తాతయ్యకు థాంక్స్ చెప్పుకొన్నాను.

**– టి వి రామకృష్ణ**



బాలసాహిత్య రచయిత, నెల్లూరు

m : 9951441131

# నీలిపిట్ట



నీలి పిట్ట! నీలి పిట్ట
గూడు కట్టింది!
గూడులోన గుడ్లు పెట్టి
పొదిగి పెట్టింది!
పొదిగి పొదిగి పిల్లల్ని
పైకి తెచ్చింది!
ఆకలేసి పిల్లలన్ని
కేకలేశాయి!
పిట్ట ఎగిరి పురుగు పట్టి
నోట పెట్టింది!
రెక్కలోకి చేరదీసి
ముద్దు పెట్టింది!

– ఎం. హరికిషన్




**పిల్లలూ...**

- బొమ్మలు గీసి పంపండి.
- ఫొటోలు తీసి పంపండి.
- కథలు, కవితలు, గేయాలు రాసి పంపండి.
- మీకు నచ్చిన పుస్తకం గురించి రాయండి.
- మీకు నచ్చిన ఆట గురించి రాయండి.
- మీకు తెలిసిన సామెతలు, పొడుపు కథలు, జోక్స్ పంపండి.
- కార్టూన్లు గీస్తారా... అవి కూడా పంపండి.

**వీటితో పాటు మీ ఫొటో, చిరునామా మరవకండి...**

**BALA CHELIMI**

"CHANDRAM" 3-6-712/2, St. No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balchelimi. com, Mob: 98480 44713

# బొమ్మలేద్దాం



**ఎందుకు** : చిత్ర లేఖనం

**ఏం కావాలి** : తెల్ల కాగితాలు, క్రేయాన్స్, స్కెచ్‌లు, పెన్సిల్స్.

**ఎలా చేయాలి** : పక్కన చూపిన విధంగా సరళమైన బొమ్మలు టీచరు ఒకటో రెండో వేసి చూపించాలి. వాళ్లతో వేయించాలి. ఇంకా వాళ్లకు ఇష్టం వచ్చిన బొమ్మలు వేయమనాలి. తరవాత వాటికి రంగులు వేయించాలి.

వేసిన బొమ్మల్ని కిందపరచి చుట్టూ చేరి పరిశీలించమనాలి. తరవాత చర్చించాలి.

**చర్చ** : వీటిలో నీకు నచ్చిన బొమ్మ ఏది? ఎందుకు నచ్చింది? బాగా రంగులు వేసిన బొమ్మలు ఏవి?

## జోక్స్






బాలచెలిమి క్లబ్

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

మెంబర్ షిప్ నెం. : ---------------

పేరు : ----------------------

తండ్రి పేరు : ----------------------

తరగతి : ----------------------

పుట్టినతేదీ : ----------------------

హాబీలు : ----------------------

చిరునామా : ----------------------

----------------------

----------------------

పిన్ : ----------------------

ఇ-మెయిల్ : ----------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



కథ

# నా తోటలో

రంగనాథపురంలో ఉండే రఘుపతి, సరళ దంపతులకు హేమంత్ ఒక్కడే కొడుకు. చదివేది ఏడో తరగతి. పచ్చని ప్రకృతి, పరిసరాలను గమనించడం అతని అభిరుచి. చదువులో కూడా చురుకే.

హేమంత్ అమ్మానాన్నలు విద్యావంతులు కావడంతో తనకి ఎన్నో కొత్త విషయాలు తెలిసేవి. రఘుపతికి ప్రశాంత జీవనం ఇష్టం. అందుకే పట్నం వాతావరణానికి దూరంగా స్థలం కొని ఇల్లు కట్టుకున్నాడు. పెద్ద ఇల్లు, చుట్టూ ప్రహరీ, కనుచూపు మేరలో కొండలు, అక్కడక్కడా ఇళ్లు ఇదీ అక్కడి వాతావరణం.



హేమంత్ బడి నుంచి రాగానే చేసే మొదటి పని పెరట్లోకి వెళ్లడమే. ఎందుకంటే... అక్కడ అన్ని రకాల పళ్లు, పూల చెట్లు, పొదలతో చిన్నపాటి అడవిని తలపించేది. తోట పనంటే హేమంత్‌కి ఎంతో ఇష్టం. పనయ్యాక పెరట్లో ఓ చాపేసుకుని అక్కడే కూర్చుని చదువుకునేవాడు. చెట్టు చెట్టునూ పరిశీలించి వాటితో కబుర్లు చెప్పేవాడు. పక్షుల అరుపుల్ని అనుకరిస్తూ, చీమల బారుల్ని ఆసక్తిగా గమనించేవాడు. సీతాకోక చిలుకల్ని, ఉడుతల కదలికల్ని కన్నార్పకుండా చూసేవాడు. సాలీళ్ల గూటి నిర్మాణం చూసి ఆశ్చర్యపోయేవాడు. సెలవర్ల రేడియేషన్ వల్ల పిచ్చుకలు అంతరించి పోతున్నాయని కలత చెందు తుంటాడు. అందుకే వాటి కోసం తోటలో అక్కడక్కడా గూళ్లు, మంచినీటి పాత్రలు ఏర్పాటు చేశాడు. పిచ్చుకల కిచ కిచలు తోటంతా ప్రతిధ్వనిస్తుంటే పులకిస్తుంటాడు.

'ఎప్పుడూ ఆ తోటలోనేనా... మరో ప్రపంచం లేదా నీకూ!' అని తల్లిదండ్రులు సున్నితంగా

మందలించినా తోటను వదిలి రావడానికి ఇష్టపడేవాడు కాదు. ఆదివారం హేమంత్ పెరట్లో చదువు కుంటుండగా ఎండిన ఆకుల చప్పుడయింది. చూస్తే ఏం లేదు. మళ్లీ చదువులో నిమగ్నమయ్యాడు.

ఈ సారి చప్పుడుతో పాటూ హిస్.. హిస్ మనే బుసలు కొడ్తున్న శబ్దం వచ్చింది. హేమంత్ లేచి ఆ వైపు వెళ్లి పరిశీలించాడు. అక్కడో... పెద్ద కొండచిలువ కనిపించింది. భయంతో కంపించిపోయాడు. అది అటూఇటూ కదులుతోంది.

హేమంత్ భయం నుంచి తేరుకొని ఇంట్లోకి పరిగెత్తాడు.

'ఏమైందిరా?... అలా వణుకుతున్నావ్?' అని వాళ్లమ్మ అడిగేసరికి 'అమ్మా... తోటలో పెద్ద కొండచిలువ' రొప్పుతూ చెప్పాడు.

ఆమె వెంటనే భర్తకు ఫోన్ చేసింది.

రఘుపతి కంగారుగా ఇంటికొస్తూ వెంట నలుగుర్ని తీసుకొచ్చాడు. వాళ్ల చేతుల్లో పెద్ద కర్రలున్నాయి. అందరూ కొండచిలువను వెతుకుతూ తోటలోకి అడుగుపెట్టారు.

వాళ్లతోపాటు హేమంత్ కూడా వెళ్లాడు. తోటలో ఓ గోడ మూలకు చుట్టచుట్టుకుని కన్పించిందది. 'అదిగో.. అక్కడుంది! అమ్మో... ఎంత పెద్దదిగా ఉందో!' అని అరుస్తూ కర్రలు లేపారు వాళ్లంతా. కొండ చిలువ ఆ అలికిడికి భయపడి పారిపోడానికి ప్రయత్నిస్తోంది.

హేమంత్ కంగారుగా 'నాన్నా! పాపం ఆ కొండచిలువ ఏం చేసింది?... దాన్నెందుకు చంపుతున్నారు? అడవుల్ని నాశనం చేస్తుంటే ఆహారం వెతుక్కుంటూ జంతువులు, కొండచిలువలు ఊళ్లలోకి వస్తున్నాయి. తప్పు మనిషిదైతే వాటిని శిక్షించడమెందుకు నాన్నా! వద్దు దాన్ని చంపొద్దు. అటవీశాఖ అధికారులకు అప్పగించండి' అన్నాడు బాధగా మొహం పెట్టి.

రఘుపతికి హేమంత్ ఆవేదన అర్థమై చంపుదామని వచ్చిన వాళ్లని వారించాడు.

అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చాడు. వాళ్లు గంటలోనే అక్కడికొచ్చి దాన్ని జాగ్రత్తగా పట్టుకున్నారు. వెళ్తూ హేమంత్‌ని అభినందించారు.

ఆ తర్వాత దాన్ని భద్రంగా అడవిలో విడిచి పెట్టేశారు.

హేమంత్ ఆనందంతో నాన్నను కౌగిలించుకుని, కృతజ్ఞతలు చెప్పాడు.

హేమంత్ మంచి మనసుకు తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు.

**- వడ్డేపల్లి వెంకటేష్**

**పిల్లల జాబిల్లి పుస్తకం నుండి...**

m : 9989596554



# దేశమును ప్రేమించుమన్నా



దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్!

పాడి పంటలు పొంగి పొర్లే
దారిలో నువు పాటు పడవోయ్
తిండి కలిగితె కండ కలదోయ్
కండ కలవాడేను మనిషోయ్!

దేశాభిమానము నాకు కద్దని
వట్టి గొప్పలు చెప్పుకోకోయ్
పూని యేదైనాను, వొక మేల్
కూర్చి జనులకు చూపవోయ్!

దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్!

– గురజాడ అప్పారావు

# కలంచెలిమి



**ఆర్.మంజుల**
8వతరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోలకల్, సి.బెళగల్,
కర్నూలు–518462



**గడ్డం అభిలాష్,**
10 వతరగతి, జి.ప.ఉ.పా.
నర్సింహులపల్లి,
పెద్దపల్లి జిల్లా.



**పల్లె వైష్ణవి**
పదవ తరగతి,
జక్కాపూర్ ఉన్నత పాఠశాల,
సిద్ధిపేట జిల్లా. 9959007914



**హరి ఓం**
8వతరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మిపూర్ గ్రామం, ఆదిలాబాద్ జిల్లా



**చతుర్యా**
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
మంగళం ట్రెండ్స్, తిరుపతి.



**చింతకుంట్ల గీతిక**
పదవ తరగతి, జిల్లా పరిషత్
బాలికల ఉన్నత పాఠశాల
మిర్యాలగూడ, నల్గొండ జిల్లా.

# ప్రథమ చికిత్స

ఆరోగ్యమే మహా భాగ్యమని అందరకూ తెలుసు. ఆరోగ్యం గురించి అవగాహన కలిగించేందుకు ప్రతి నెలా బాలచెలిమి ఆరోగ్య విజ్ఞానం అందిస్తుంది. ఈ నెల ప్రథమ చికిత్స గురించి కొంత తెలుసుకుందాం.

### ప్రథమ చికిత్స

ప్రమాదం జరిగినప్పుడు వ్యక్తిని రక్షించడానికి డాక్టర్ల వైద్యం అందే వరకు తాత్కాలికంగా చేసే వైద్య సహాయాన్ని ప్రథమ చికిత్స అంటారు.

### గాయాలకు ప్రథమ చికిత్స

**గాయాలు అయినప్పుడు ఆ వ్యక్తిని ఎలా కాపాడాలి?**

చిన్న సహాయం విలువైన ప్రాణాన్ని కాపాడుతుంది. ఏదైనా ప్రమాదం వలన గాయాలు అయినప్పుడు చేతులను శుభ్రం చేసుకొని, శుభ్రమైన గుడ్డతో కాని బ్యాండేజ్‌తో గాని సున్నితమైన ఒత్తిడిని కల్గించి రక్తస్రావం ఆపాలి. రక్తస్రావం ఆగిన తరువాత సబ్బు నీటితో శుభ్రం చేయాలి. సందర్భాన్ని బట్టి క్రిమినాశకంతో కూడా శుభ్రపరచాలి. గాయాన్ని శుభ్రమైన గుడ్డతో గాని, గాజు గుడ్డతో గాని కట్టు కట్టాలి. తీవ్రమైన రక్తస్రావం అయితుంటే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.

### కాలిన గాయాలకు ప్రథమ చికిత్స

మంటలు ఏమైనా ఉంటే గొంగడిని ఉపయోగించి ఆర్పివేయాలి. కాలిన ప్రాంతంలోని ఆభరణాలను, వాచ్‌లను దుస్తులను వీలైతే తొలగించాలి. కాలిన గాయాన్ని త్వరగా చల్లటి శుభ్రమైన నీటితో చల్లబరచాలి. లేదా తడిపిన శుభ్రమైన గుడ్డతో చల్లబరచాలి. మిగతా శరీరాన్ని వెచ్చగా ఉంచాలి. ఐస్, వెన్నె, క్రీమ్‌లు




మొదలైన వాటిని వాడరాదు. వీలైనంత త్వరగా ఆసుపత్రికి చేర్చాలి.

### గుండెనొప్పికి ప్రథమ చికిత్స

ఛాతీలో నొప్పి నిండుగా ఉన్నట్లు అనిపించడం, నొప్పి క్రమంగా దవడ, భుజం, చేతుల వరకు పాకడం జరిగి, చల్లటి చెమట, వికారం, అజీర్ణం, వాంతులు, చేతిలో తిమ్మిర్లు, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలను గుండెపోటుగా భావించాలి. ఈ లక్షణాలను చూసిన వెంటనే వ్యక్తిని కూర్చోబెట్టాలి. విశ్రాంతినివ్వాలి. ప్రశాంతంగా ఉండేటట్లు చూడాలి. దుస్తులు బిగుతుగా ఉంటే వదులుగా చేయాలి. గుండెనొప్పికి సంబంధించిన గోళీలు ఏమైనా వాడుతున్నాడో తెలుసుకొని అందించాలి. వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లో నడిపించరాదు. గాబరా పెట్టరాదు. ఆస్ప్రిన్‌లాంటి గోళీలను అందించాలి. (అతనికి దానికి సంబంధించిన ఎలర్జీ లేకుంటే). అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లయితే సి.పి.ఆర్. (Cardiopulmonary resucitation) చేయాలి. ఛాతీపైన చేతులతో ప్రేజర్ చేస్తూ ఉండాలి. వెంటనే ఆసుపత్రికి చేర్చాలి.

**– ఆరోగ్యం – విజ్ఞానం** ఆధారంగా...

తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాదు.



విహార స్థలాలు

# తెలంగాణా గ్రీన్ వ్యాలీలో 'గాడి'ద జలపాతం

అందాన్ని వెతికి పట్టుకునే ప్రయత్నం చేసి సఫలీకృతమైనప్పుడు కలిగే ఆనందం ఒక మధుర స్మృతి అవుతుంది. మనం గ్రీన్ వ్యాలీలోని 'గాడి'ద గుండాన్ని చూసినప్పుడు ఆ మధుర స్మృతి మిగులుతుంది. గాడిద గుండం మనం ప్రకృతితో మమేకమయ్యే అవకాశాన్నిచ్చి తీయని స్మృతిని ఇస్తుంది. గోదావరి నదికి అవతలి జిల్లా ఆదిలాబాద్, ఇవతలి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో రాష్ట్రంలోనే అందమైన అడవులున్నాయి. గోదావరి లోయలో ఉన్న ఈ అడవులను తెలంగాణా గ్రీన్ వ్యాలీ (హరిత లోయ) అనాలి. అలాంటి అరుదైన, అందమైన అడవుల్లో మరింత అందమైన, అత్యంత ఎత్తైన జలపాతం ఉందని ఆ ప్రాంతంలోని వారికి కూడా తెలియకపోవడం దురదృష్టకరం. హైదరాబాద్ నుండి 250 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది ఈ గాడిద గుండం జలపాతం. దీన్ని చేరడానికి పచ్చని అడవులు, గుట్టలు, లోయల్లో మూడు కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది. ఇక్కడికి నిర్మల్, ఇచ్చోడ, సిరిచెల్మ, పట్టణం, గుండిబాగ్‌ల మీదుగా వాహనంలో కూడా రావచ్చు. ఈ ప్రాంతంలో మరాఠీలు, లంబాడీలు, గోండులు, ఆంధ్‌లు, ముస్లింలు మాత్రమే కాకుండా గిరిజనేతరులు కూడా ఉన్నారు. అంటే ఈ ప్రాంతంలో విభిన్న జాతుల సమ్మేళనాన్ని, వైవిధ్య సంస్కృతులను... భిన్నత్వంలో ఏకత్వాన్ని చూడవచ్చు. కొందరు ఈ జలపాతాన్ని ముక్కిడి గుండం అని పిలిస్తే, మరి కొందరు గాడిద జలపాతం అంటారు. స్థానిక ప్రజలు ఈ జలపాతానికి మొక్కుతారు. అందుకే దీనికి 'మొక్కుడు జలపాతం' అని, ఇది 'గాడి'లో నుంచి దుంకుతుంది కాబట్టి 'గాడి'ద గుండం అని పేర్లు వచ్చాయి.

గాడిద గుండం జలపాతం పరిసరాలూ మనల్ని పరవశానికి గురి చేస్తాయి. ఎత్తైన పచ్చని కొండల మధ్య వంపు తిరిగిన విల్లులా ఒక వాగు ప్రవహిస్తుంది. అదీ ఒక ఇరుకైన గాడిలో. అంతకంటే ఎక్కువగా పరవశింప చేసే దృశ్యం అల్లంత దూరంలోనే కనిపిస్తుంది. అదే అసలైన అందమైన జలపాతం. ముందు వినిపిస్తుంది... 200 అడుగుల ఎత్తు నుండి దూకే జలపాత శబ్దం. ఇది మన రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతాల్లో ఒకటి. ఈ జలపాతం చుట్టూ 500 అడుగుల ఎత్తైన కొనదేలిన కొండల వరుసలు పచ్చని చెట్లతో కళకళలాడుతూ ముసురుకున్నాయి. ఈ కొండల మధ్య తూర్పు సగభాగం ఎత్తైన పీఠభూమి, పశ్చిమ సగభాగం ఏటవాలు లోయ ఎంతో అందంగా కనిపిస్తుంది. జలపాతం కింద ఉన్న లోయలోకి వెళ్తే జలపాతం ఎత్తు, అందాన్ని సంపూర్ణంగా చూసి ఆనందించవచ్చు. ఇక్కడ రోప్‌వే నిర్మిస్తే ఇదొక అద్భుతమైన ఎకో టూరిజం ప్రాజెక్ట్ కాగలదు. జాతీయ రహదారి నెం.44కు దగ్గరగా ఉండటం వల్ల పర్యాటకులతో కిటకిటలాడే అవకాశమూ ఉంది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ

m : 94909 57078

# ఇంజనీయర్ జంతువు

అమెరికాలో మాంటానా అనే ప్రాంతం ఉంది. మాంటానాలో ఉన్న నదిమీద రెండువేల అడుగుల పొడవుగల ఆనకట్ట కట్టబడింది. ఇంతకి ఆనకట్టను కట్టింది మనుషులనుకొంటున్నారా? ఎంత మాత్రం కాదు. దాన్ని కట్టింది. 'బీవర్' అనే జంతువు.

బీవర్ నీటి జంతువు. ఇది దాదాపు 25 కిలోల బరువు ఉంటుంది. నీటిలో చాలా వేగంగా ఈదుతుంది. నీటి అడుగున పదిహేను నిమిషాల పాటు హాయిగా ఉండగలుగుతుంది. నీటి అడుగున ఉన్నప్పుడు బీవర్ ముక్కు, చెవులు వాటంతట అవే మూసుకు పోతాయి.



బీవర్ శాఖాహారి. చెట్ల బెరడును, ఆకులను తింటుంది. దీని ముందు పళ్ళు నిరంతరం పెరుగు తూనే ఉంటాయి. అందుకే అది ఎప్పుడూ దేన్నో ఒకదాన్ని కొరుకుతూ తన పళ్ళు మరీ పెరిగిపోకుండా జాగ్రత్త పడుతూ ఉంటుంది.

నదికి ఆనకట్ట కట్టడం మాటలతో అయ్యేపని కాదు. అందులోనూ బీవర్ లాంటి చిన్న జంతువు ఆ కార్యం ఎలా నిర్వర్తిస్తుందో తెలుసుకోవాలని ఉబలాట పడుతున్నారు కదూ! అయితే చదవండి! బీవర్లు నదికి దగ్గరగా ఉన్న చెట్లను మొదలంటా కొరికి కింద పడేస్తాయి. తరువాత బెరడును ఒలుచుకు తినేస్తాయి. కొమ్మలను రెమ్మలను వేరు చేస్తాయి. అప్పుడు కాండం మటుకు మిగులుతుంది. ఆ కాండాన్ని ముక్కలుగా కోస్తాయి. తరువాత ఆ ముక్కలను ఆనకట్ట కట్టడానికి, ఇళ్ళు కట్టుకోవడానికి తీసుకుపోతాయి. ఒక్కోసారి బీవర్లు కొండల మీద ఉన్న చెట్లను కొట్టి వాటి కాండాలను కిందికి దొర్లించుకుంటూ తీసుకొని వస్తాయి. 12 అడుగుల పొడవు ఉన్న దుంగలను కూడా అవి కొండలపై నుంచి కిందికి తెస్తాయి.

అవి పడేసిన చెట్లు నదికి దూరంగా ఉంటే వాటిని నది దగ్గరకు తీసుకు రావడానికి నది నుంచి చిన్న చిన్న కాలువలు తవ్వి, ఆ కాలువల ద్వారా దుంగలను నదిలోకి తీసుకుపోతాయి. ఒక అడుగు లోతు, నాలుగు అడుగుల వెడల్పు, వెయ్యి అడుగుల పొడవు గల కాలువలను తవ్వి, వాటి ద్వారా అవి నదులలోకి దుంగలను చేరవేస్తాయి. తరవాత ఆనకట్ట కట్టడం మొదలవుతుంది దుంగల్ని, రాళ్లను, కొమ్మలను ఒకదానిపై ఒకటి పేర్చి గోడలా కడతాయి. వాటి మధ్యగల ఖాళీలను బురదతో "పూడ్చివేస్తాయి. అలా ఆనకట్ట కట్టడం పూర్తి అవుతుంది.

ఆనకట్ట కట్టడం ద్వారా అక్కడ నదిలో నీటిమట్టం పెరుగుతుంది. బాగా లోతు ఉన్న పెద్ద మడుగు ఏర్పడుతుంది. ఆ మడుగును బీవర్ తను ఇల్లు కట్టుకోవడానికి స్థలంగా వాడుకొంటుంది. దుంగలను, కర్ర ముక్కలను, కొమ్మలను, బీవర్లు ఇళ్ల నిర్మాణంలో వాడతాయి. వీటి గుమ్మటాల్లా ఉంటాయి. పై కప్పునీటి బయటకు పొడుచుకు వస్తుంది. ఆ కప్పులో బీవర్లు చిన్న రంధ్రాన్ని వదిలేస్తాయి. దానిద్వారా వాటి ఇళ్ళల్లోకి గాలి వెలుతురు వస్తాయి. ఇళ్ళ వాకిళ్ళు మటుకు నీటిలోకే తెరుచుకొని ఉంటాయి. బీవరులు నీటి అడుగు నుండే తమ ఇళ్లల్లోకి ప్రవేశిస్తాయి.

**– బాలచెలిమి**

మార్చి – 1991

# పిల్లలు.. పిడుగుల్లై మెరిశారు

తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్‌కు సంతోషంగా వచ్చిన పిల్లలు... ఎంతో విజ్ఞానం, నైపుణ్యం సాధించి పిడుగుల్లా మెరిశారు. విజ్ఞానం వినోదంతో పాటు సరదాగా గడిపారు. 18 రోజులుగా నిర్వహించిన తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పిల్లలు 18 రోజులుగా మొబైల్ ఫోన్స్, ట్యాబ్, టీవీలు, ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉన్నారని పిల్లలకు అవకాశాలిస్తే అద్భుతాలు సృష్టిస్తారని బాలోత్సవం నిరూపించిందని అన్నారు. చొక్కాపు వెంకట రమణ మాట్లాడుతూ... ఈ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా వ్యవసాయ క్షేత్రం అయిన రాజేంద్రనగర్‌కు పిల్లలను బస్సుల్లో తీసుకెళ్లి వ్యవసాయం, పండ్ల తోటలను చూపించి, వాటి గురించి వివరించామన్నారు. వ్యవసాయ పరిశోధనా అధికారులతో మాట్లాడించి పిల్లలకు పంటలు పండే విధానాన్ని చూపించినట్టు తెలిపారు. ఆడపిల్లలకు ఈ క్యాంపు ఆత్మగౌరవ భరోసానిచ్చిందన్నారు. ప్రశ్నించేతత్వాన్ని నేర్పిందని చెప్పారు.



జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... పిల్లలు అన్ని రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. ఎన్‌వీకే కార్యదర్శి ఎస్. వినయ్ కుమార్ మాట్లాడుతూ... విజ్ఞాన కేంద్రంలో బాలల కోసం గ్రంథాలయం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం ఉపాధ్యక్షులు కె. సుజావతి, మమత, పద్మ, కోశాధికారి జి.బుచ్చిరెడ్డి, తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు నవీన్, గోపాల్, భవాని, మానస తదితరులు పాల్గొన్నారు.

– బాలచెలిమి డెస్క్

# రేపటి తరం కోసం మరో గ్రంథాలయ ఉద్యమ యాత్ర

మరో గ్రంథాలయ ఉద్యమకారులు కాసుల రవికుమార్, మంచికంటి వరంగల్ జిల్లా నర్సంపేట నుండి మే 26న తెలంగాణ వ్యాప్తంగా మరో గ్రంథాలయ ఉద్యమ యాత్రను ప్రారంభించారు. వివిధ ప్రాంతా లకు చెందిన గ్రంథాలయ ఉద్యమ కారులను, రచయితలను, మేధావు లను కలుస్తూ కొనసాగిన యాత్ర మొదటి దశ ముగింపు సభ 31.5.2024న హిమాయత్ నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో జరిగింది.




ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త సాహితీవేత్త వాడ్రేవు చిన వీరభద్రుడు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్, బాల చెలిమి నిర్వాహకులు ప్రముఖ విద్యావేత్త మణికొండ వేద కుమార్, గ్రంథాలయ పితామహ పద్మశ్రీ వెంకటరమణయ్య గారి మనువడు అయ్యంకి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో వాడ్రేవు చినవీరభద్రుడు గారు మాట్లాడుతూ మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత తమ పిల్లలకు పుస్తకాలు చదవడం గురించి అలవాటు చెయ్యాలని. వివిధ పుస్తకాలను పిల్లలకు చేర వేయాల్సిన అవసరం ఉందని, ఈ ఉద్యమానికి తన తోడ్పాటు ఉంటుందని, ఒక కార్యకర్తగా గ్రంథాలయం ఉద్యమం కోసం పని చేస్తానని తెలియ జేశారు.

–బాలచెలిమి డెస్క్

కథ

# సేంద్రీయ ఎరువులు

హైదరాబాద్ అనే మహా నగరంలో కేతన్, కేశవ్ అనే ఇద్దరు మిత్రులు ఉండేవారు. వాళ్ళ సొంతూరు అద్వైత పురం. అది ఒక చిన్న పల్లెటూరు కావడం చేత వారు పైచదువుల కొరకు పట్నం వచ్చారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉచిత విద్యను అభ్యసిస్తున్నారు. కేతన్ భౌతికశాస్త్రంలో, కేశవ్ రసాయన శాస్త్రంలో పి.హెచ్‌డి. పరిశోధన చేస్తున్నారు. సెలవులకు వారి సొంత ఊరు వెళ్ళి అమ్మా నాన్నలతో, ఇంకా వారి ఊరి ప్రజలతో ఆనందంగా గడిపి మళ్ళీ తిరిగి వచ్చి వారి పరిశోధనల్లో మునిగిపోయే వారు. కొద్ది రోజులకు వారి పరిశోదన పూర్తి అయ్యింది. వారికి విదేశాల్లో మంచి ఉద్యోగం కూడా వచ్చింది.

కానీ వారికి ఆ ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. ఎందుకంటే వాళ్ళ సొంతూరుకు దూరంగా, వారి అమ్మ నాన్నలను వదిలి విదేశాలకు వెళ్లడం వారికి ఇష్టం లేదు. తమ చదువు ఊరి ప్రజలకు ఉపయోగపడాలనుకున్నారు. అందుకొరకు వారు విదేశీ ఉద్యోగాన్ని వదులుకొని తిరిగి సొంతూరుకు వచ్చారు. కేతన్, కేశవ్ నిరుపేద వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. ఇంకా ఆ ఊరిలో ఎంతో మంది యువకులు ఉపాధి లేకుండా ఉన్నారు. వారి కొరకు ఏదో ఒకటి చేయాలనుకున్నారు.

కేతన్, కేశవ్ అద్వైత పురం వచ్చి అక్కడ సేంద్రీయ ఎరువుల తయారీ పరిశ్రమ పెట్టాలనుకున్నారు. ప్రభుత్వ నుండి లోన్ తీసుకున్నారు. వారు చుట్టూ పక్కల ఊర్ల నుండి పశువుల పేడను సేకరించి తయారు చేసిన సేంద్రీయ ఎరువులను రసాయనిక ఎరువుల కంటే తక్కువ ధరకే అమ్మేవారు. దాంతో ఊరిలో చాలా మంది ఆ ఎరువులు కొన్నారు. అనూహ్యంగా ఆ రైతుల పంట దిగుబడి కూడా పెరిగింది. పక్కన ఉన్న రామాపురం, వెంకయ్య పల్లె, జగదేవ్ పేట గ్రామ ప్రజలు కూడా వీరి ఎరువులు కొనడానికి ఎగబడ్డారు.



దాంతో వారి ఎరువులకు గిరాకీ బాగా పెరిగింది. ఊరిలో ఉన్న నిరుద్యోగులను పనిలో పెట్టుకున్నారు. ఇంకా సేంద్రీయ ఎరువుల పరిశ్రమను విస్తరించారు. రైతులు వీరు తయారు చేసిన ఎరువులను వాడి రకరకాల పంటలు పండించారు. రసాయన మందులు వాడని పంటలు కాబట్టి ప్రజలు వాటిని బాగ కొనుగోలు చేశారు. రైతుల శ్రమకు ఫలితం తక్కింది. తమ నేర్చుకున్న చదువుతో ఎంతో మందికి ఉపాధి కల్పించిన కేతన్, కేశవ్ లను అందరూ మెచ్చుకున్నారు.

- ఎం.డి. అస్మీన్,
ఇంటర్ సెకండ్ ఇయర్,
గ్రా. జగదేవ్ పేట, జగిత్యాల జిల్లా.
m : 8790960236







చేత వెన్న ముద్ద
చెంగల్వ పూదండ
బంగారు మొలత్రాడు
పట్టు దట్టి
సందిట తాయత్తులు
సిరిమువ్వ గజ్జలు
చిన్ని కృష్ణా నిన్ను
చేరి కొలుతు













చుక్ చుక్ రైలు వస్తోంది
దూరం దూరం జరగండి
ఆగినాక ఎక్కండి
జోజో పాపా ఏడవకు
లడ్డు మిఠాయి తినిపిస్తా
చల్లని పాలు తాగిస్తా

– బాలచెలిమి



బొమ్మ: కైరంకొండ బాబు
m : 9440355424

# బాల సాహిత్య సమ్మేళనం...



హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ వరప్రసాద్ రెడ్డి మాతృమూర్తి శ్రీమతి కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం రెండు రోజుల (మే 29,30–2024) పాటు అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగింది. రెండు తెలుగు రాష్ట్రలతో పాటు, ఇతర ప్రాంతాలలో నివసిస్తున్న బాల సాహితీ వేత్తలు, రచయితలు, సాహిత్య అభిమానులు, ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. బడిలో తెలుగు భాష, పత్రికలు – బాలసాహిత్యం, కథ చెప్పే కళ, లలిత కళా పరిచయం, బాలసాహిత్యం – ప్రమాణాలు, బాలసాహిత్యం – గ్రంథాలయాలు వంటి విభిన్న అంశాలపై ప్రముఖ బాలసాహితీవేత్తలు వివిధ రంగాల మేధావులు విస్తృతస్థాయిలో చర్చించారు. ఈ సమ్మేళనం బాల సాహిత్యం తీరుతెన్నులు, వివిధ పోకడలు, జరుగుతున్న పరిణామాలు, కాలానుగుణమైన మార్పులు మొదలైన అంశాలపై పెద్ద ఎత్తున చర్చించి అటు బాలలకు, ఇటు బాల సాహితీకారులకు ఒక దిశా నిర్దేశం చూపింది.

సాహిత్య పరిషత్తు ప్రచురించిన బాలసాహిత్య గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు డా. ఎల్లూరి శివా రెడ్డి , ముఖ్య అతిధిగా శాంతా – వసంత ట్రస్ట్ అధ్యక్షుడు డా.వరప్రసాద్ రెడ్డి,పరిషత్తు కార్యదర్శి డా. చెన్నయ్య, బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్, గరిపల్లి అశోక్, తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పిల్లల కోసం రూపొందించిన పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్రవిద్యా పరిశోధన మండలి డైరెక్టర్ రాధారెడ్డి హామీ ఇవ్వడడంతో బాలసాహితీకారులు హర్షం వ్యక్తం చేశారు.

– బాలచెలిమి డెస్క్

అలనాటి అరుదైన ఫోటో :

1937వ సంవత్సరం నాటి

**పడవ గ్రంథాలయం**

తెనాలి

ఆంధ్రప్రదేశ్



# అంతరిక్ష విజ్ఞానం

ప్ర : అంతరిక్షం అంటే ఏమిటి?

జ : **అంతరిక్షం అనేది అనంతమైన త్రిమితీయ ప్రదేశం. భూమి యొక్క వాతావరణ కక్ష్యకు ఆవల ఉన్న అనంతమైన భాగాన్ని అంతరిక్షం అంటారు.**

ప్ర : విశ్వం అంటే ఏమిటి?

జ : **విశ్వం అంటే మనం ఆకాశంలో చూసే బిలియన్ల కొద్దీ నక్షత్రాలు, గ్రహాలు, తోకచుక్కల వంటి అంతరిక్ష వస్తువుల సమాహారం.**

ప్ర : నక్షత్రాల సమూహాన్ని ఏమంటారు?

జ : **గెలాక్సీ.**

ప్ర : సూర్యుడు ఉన్న గెలాక్సీ పేరు?

జ : **మిల్క్ వే గెలాక్సీ**

ప్ర : సౌర వ్యవస్థ అంటే ఏమిటి?

జ : **సూర్యుడు, దాని చుట్టూ తిరుగుతున్న గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఇతర ఖగోళ వస్తువులను సౌర వ్యవస్థ అంటారు.**

ప్ర : సూర్యుడికి దగ్గరగా ఉన్న గ్రహం ఏది?

జ : **బుధుడు**

ప్ర : అన్ని గ్రహాలలోకెల్లా అత్యంత వేడిగా ఉండే గ్రహం ఏది?

జ : **శుక్రుడు**

ప్ర : భూమి సహజ ఉపగ్రహం ఏది?

జ : **చంద్రుడు**

ప్ర : రెడ్ ప్లానెట్ అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?

జ : **అంగారకుడు (మార్స్)**

ప్ర : సౌర వ్యవస్థలో అతిపెద్ద గ్రహం ఏది?

జ : **బృహస్పతి**

ప్ర : మన సౌర వ్యవస్థలో రెండవ అతిపెద్ద గ్రహం ఏది?

జ : **శని**

ప్ర : టెలిస్కోప్ సహాయంతో కనుగొనబడిన మొదటి గ్రహం ఏది?

జ : **యురేనస్**

ప్ర : మన సౌర వ్యవస్థలోని చివరి గ్రహం ఏది?

జ : **నెప్ట్యూన్**

ప్ర : సోవియట్ యూనియన్ స్పుత్నిక్‌ని ఎప్పుడు ప్రయోగించింది?

జ : **అక్టోబర్ 4, 1957**

ప్ర : భూమికి ప్రయోగించబడిన మొదటి కృత్రిమ ఉపగ్రహం ఏది?

జ : **స్పుత్నిక్**

ప్ర : అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి వ్యక్తి ఎవరు?

జ : **యురి. ఎ. గగారిన్ 1961 ఏప్రిల్ 12న అంతరిక్షంలోకి వెళ్లారు**

ప్ర : చంద్రునిపై అడుగుపెట్టిన మొదటి వ్యక్తి ఎవరు?

జ : **నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ 1969లో చంద్రునిపై అడుగు పెట్టిన మొదటి వ్యక్తి.**

ప్ర : యు.ఎస్.ఎ. విజయవంతం చేసిన మొదటి ఉపగ్రహం ఏది?

జ : **31 జనవరి 1958 రోజున యు.ఎస్.ఎ. ఎక్స్‌ప్లోరర్ 1**

ప్ర : భారత దేశ జాతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఏది?

జ : **ఇస్రో (ISRO - Indian Space Research Organisation), Banglore**

– ఆరోగ్యం–విజ్ఞానం

తెలంగాణ సారస్వత పరిషత్ ఆధారంగా..

## సమాచారం

మన లైబ్రరి, జహీరాబాద్ మరియు శ్రామిక్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో

# పిల్లల వేసవి శిబిరాలు

గత 16 సం.ల నుండి "మనలైబ్రరి" జహీరాబాద్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవి శెలవల్లో పిల్లల కోసం వారం రోజులు "సమ్మర్ క్యాంప్'లు నిర్వహిస్తున్నాము. ఆయా రంగాల్లో నిపుణులను పిలిపించి ఆటలు, పాటలు, నృత్యం, నాటికలు, డ్రాయింగ్, పేపర్‌తో మరియు మట్టితో బొమ్మలు, రోబోటిక్స్, వుడ్ వర్క్, పప్పెటరీ (తోలు బొమ్మలాట), హాండ్ రైటింగ్, కథలు రాయడం, కథలు చెప్పడం వంటి అంశాలు నేర్పిస్తున్నాము. C.A. ప్రసాద్, చొక్కాపు వెంకటరమణ, దాసరి వెంకట రమణ, V.R. శర్మ, ఎజాస్ అహమ్మద్, చంద్రశేఖర్ ఆజాద్, అడవి రాముడు, లక్ష్మణరావు, ఫయాజ్ వంటి నిపుణుల నేతృత్వంలో ఈ శిబిరాలు నిర్వహించాము. పిల్లలు వివిధ నైపుణ్యాలు నేర్చుకోవడం ద్వారా తమలో ఉన్న ప్రతిభను తెలుసుకోగల్గి మెరుగుదిద్దుకోగల్గుతారు.

2024 సం.లో "మన లైబ్రరి మరియు శ్రామిక్ విజ్ఞాన కేంద్రం" ఆధ్వర్యంలో మొత్తం 14 సెంటర్లలో " వేసవి పిల్లల శిబిరాలు " జరపాలని నిర్ణయించడం జరిగింది. 2 సెంటర్లలో 7 రోజులు, 2 సెంటర్‌లలో 15 రోజులు నడపగా, 10 సెంటర్ లలో 30 రోజులు చక్కగా నడిపారు. గతంలో నేర్పిన రెగ్యులర్ యాక్టివిటీస్ తో పాటుగా ఈ సారి మాస్కుల తయారి, స్టిక్ పప్పేట్స్, ఫింగర్ పప్పెట్స్, ఫోటో ఫ్రేమ్స్, పేపర్ బ్యాగ్స్... ఇలా ఎన్నో కొత్త అంశాలు నేర్చుకున్నారు. నెల రోజుల టైమ్ టేబుల్ ప్రకారం తెలుగు, ఇంగ్లీష్ చదవడం కూడా నేర్పించడం, పుస్తకాలు చదివించడం కూడా చేయగలగడం మంచి అనుభవం.

**డా.ఎ.విజయలక్ష్మి,**
జహీరాబాద్



## ఘనంగా చిగురింతలు పుస్తకావిష్కరణ




ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక హరిచరణ్ పాఠశాలలో ఇటీవల చింతల శ్రీనివాస గుప్త రచించిన "చిగురింతలు" పుస్తకావిష్కరణ సభ సంస్థ అధ్యక్షులు డా. కాసర్ల నరేశ్ రావు అధ్యక్షతన ఘనంగా జరిగింది.

ఈ సభలో ఆవిష్కర్తగా పాల్గొన్న డా. అమృతలత మాట్లాడుతూ.. బాలసాహిత్యం అనేది ఎదిగిన ఎంతోమందిని తీర్చిదిద్దిన అమృతధార అని, చింతల శ్రీనివాస గుప్త రచించిన చిగురింతలు నేటి బాలలకు దిక్సూచిగా నిలుస్తుందనీ, అలతి అలతి పదాలతో, అందమైన పదజాలంతో, మానవ అనుబంధాలను పటిష్టం చేసేవిధంగా, సామాజిక బాధ్యత తెలిపే విధంగా గేయాలున్నాయని, చింతలను అభినందించారు. ముఖ్య అతిథి వి.ఆర్.శర్మ గారు మాట్లాడుతూ, బాలసాహిత్యానికి రేపటి రోజును నిర్ణయించే శక్తి ఉంది అని, ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక తమ కృషిని కొనసాగించాలని ఆశించారు. ప్రపంచ సాహిత్యం లో పిల్లల పుస్తకాలు విరివిగా వచ్చాయనీ, తెలుగులో ప్రఖ్యాతకవులు బాలసాహిత్య సృజన చేసారన్నారు. నేడు పిల్లల ఆలోచనలను పిల్లలే రాయాలనీ, పెద్దలు కూడా పిల్లల జీవితాలను వివిధ సాహిత్య ప్రక్రియల్లో ఆవిష్కరించా లన్నారు. విశిష్ట అతిథిగా తల్లావజ్ఝల మహేశ్ బాబు, గౌరవ అతిథిగా బోర్గాం పాఠశాల ప్రధానో పాధ్యాయులు శంకర్, ప్రవీణ్ కుమార్ శర్మ, గంట్యాల ప్రసాద్, డా. శారద, దారం గంగాధర్, సమత, శ్రీమన్నారాయణ చారి, తంగుడిగె శ్రీనివాస్, సాయిప్రసాద్, రమణాచారి, అలివేణి, కే. బాబు, రామ్మోహన్, కైలాస్, డా. దస్తగిరి, కే. రజిత, వ్యాస్, తిరీమల శ్రీనివాస్, కందకుర్తి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**డా. కాసర్ల నరేశ్ రావు**



## జయప్రదంగా వేమన విజ్ఞాన కేంద్రం ఆట మాట పాట సమ్మర్ క్యాంప్

తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ఏప్రిల్ 28వ తేది నుండి 35 రోజులపాటు నిర్వహించడం జరిగింది. ఇందులో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు 230 మంది పిల్లలు హాజరయ్యారు. ఇందులో సులభశైలిలో మాథ్స్ ఎలా చేయాలి అనే అంశంపై మరియు జీవవైవిద్యం గురించి అవగాహన కల్పించడం, సైన్స్‌తో మేజిక్ చేసి మూఢనమ్మకాల గురించి అవగాహన కల్పించడం, చెస్‌లోని మెలకువలు నేర్పడం, తెలుగు వ్రాయించడం చదివించడం, దేశభక్తి గీతాలు, డ్యాన్సులు నేర్పించడం, గుండ్రటి చేతి వ్రాతలో మెలకువలు చెప్పించడం, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పడం, చిత్రలేఖనం నేర్పడం, పిల్లలకు కథలు చెప్పడం, పిల్లలచే కథలు చెప్పించడం జరిగింది. ఇందులో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, ముఖ్య సలహాదారు టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, ముని లక్ష్మి, గురునాథం, రెడ్డెప్ప, రఫీ, ముఖేష్, పద్మజ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ప్రముఖ గణితావధాని అరుణ శివప్రసాద్, పర్యావరణవేత్త జి. సుధాకర్, ప్రముఖ మెజీషియన్ డి.విజయ్ కుమార్, ఎంఎస్ యుగంధర్ బాబు, చెస్ ట్రైనర్ బాలాజీ చౌదరి, తెలుగు ఉపాధ్యాయులు గురుస్వామి, డాన్స్ మాస్టర్ కేఎస్ బాలసుబ్రమణ్యం, గుండ్రటి చేతి వ్రాత నిపుణురాలు సంగరాజు అశ్వని, స్పోకెన్ ఇంగ్లీష్ డాక్టర్ గోపాల్, చిత్రలేఖనం ప్రముఖ చిత్రకారులు బి కిరణ్ కుమారి, ఎస్ భువనేశ్వరి, జి గాయత్రి అర్చన వ్యవహరించారు,

ప్రముఖ కర్ర సాము శిక్షకుడు మద్దూరు మునిరాజ గారిచే కర్రసాము 30 రోజుల పాటు ఇప్పించారు.

**మల్లారపు నాగార్జున,**
వేమన విజ్ఞాన కేంద్రం, తిరుపతి. 9398000686



## రసమయి బాలల ఉగాది పురస్కారాలు

గత 56 సంవత్సరాల నుండి ఎందరో కళాకారులను ప్రోత్సాహిస్తున్న రసమయి సంస్థ త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ఉగాది పురస్కారాల కార్యక్రమంలో సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన విద్యార్థులు చిత్రలేఖనంలో పురస్కారాలు అందుకున్నట్లు సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్, డైరెక్టర్ సత్యవోలు రాంబాబు తెలిపారు.

ఈ పురస్కారాలను యలమర్తి పూజ్యంత్, ప్రవ్య ఆదిత్రి రెడ్డి కానాల, సి. హెచ్. ఇషిత్, కృతికాన్స్‌లు విశ్రాంత హైకోర్ట్ జడ్జి బి. చంద్రకుమార్, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు ఎస్.పి. భారతి, రసమయి సంస్థ అధ్యక్షులు ఎం.కె. రాము గారి చేతుల మీదుగా అందుకొన్నారు.

తమ పిల్లలు ఈ అవార్డ్స్ అందుకోవడం తమకు చాలా సంతోషంగా ఉంది అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్త పరిచారు. చిత్రలేఖన గురువులు సత్యవోలు రాంబాబు, సత్యవోలు పూజిత విద్యార్థులను అభినందించారు

## కథలు జీవన వికాసానికి సోపానాలు

కథల పుస్తకాలు జీవన వికాసానికి సోపానాలని, విద్యార్థులు బాల్యం నుండే నీతి కథలు చదవడం ద్వారా ఉత్తమ సమాజాన్ని నిర్మించే భావి భారత పౌరులుగా తయారవుతారని, వేసవి సెలవులను పుస్తక పఠనం ద్వారా సద్వినియోగం చేసుకోవడం విద్యార్థుల ఉత్తమ లక్షణమని సుగుణ సాహితి సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య అన్నారు. శుక్రవారం సిద్దిపేట సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీ మేధ వేసవి శిక్షణా శిబిరంలోని విద్యార్థులకు సుగుణ సాహితి సమితి ఆధ్వర్యంలో డా. సిరి వ్రాసిన సిల్వర్ పికాక్ ఫీతర్ అనే 54 ఆంగ్ల కథల పుస్తకాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దేవరాజు, రామరాజు, బాల సాహితీవేత్త పెందోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వ్యక్తిత్వం

# నేనూ నా బాల్యం

**"చిన్నప్పుడు నేను పుట్టిన ప్రదేశం, ఆ పరిసరాలే నన్ను నాట్యకళ వైపు మళ్లించాయి." అంటున్న శ్రీ నటరాజ రామకృష్ణ చిన్ననాటి కబుర్లు విందామా!**

భారత దేశానికి వేలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న బాలిదీవుల్లో 1933లో పుట్టాను. బౌద్ధం, హిందూ పద్ధతులు, సంప్రదాయాలు మన నృత్య రీతులు సజీవంగా ఉన్నాయక్కడ. పండుగలు, ఉత్సవాలప్పుడు అక్కడ దేవాలయాల్లో నృత్య కార్యక్రమాలు జరుగుతాయి. అజంతా, ఎల్లోరాల్లోని సుందర స్త్రీలు జీవం పోసుకొని నృత్యం చేస్తున్నారా అనే భ్రమ కలుగుతుంది. వారి వేషం, అలంకరణ కూడా అలాగే ఉంటుంది.



ఎటు చూసినా పచ్చదనం, మనుష్యుల మధ్య స్నేహభావం, అంతా ఉత్సాహంగా ఉంటుంది. ఆ పరిసరాలు, ఆ వాతావరణమే నాలో నాట్యం పట్ల ఉత్సాహాన్ని కలిగించాయి.

నా అయిదేళ్ళప్పుడు బాలి ద్వీపం నుండి గుంటూరు జిల్లాలోని చిన్న పల్లెటూరుకు వచ్చాము. అయినా అక్కడి పరిసరాలు ఆ జ్ఞాపకాలు నాలో ఈ రోజుకు నూతనంగానే ఉన్నాయి. ఏదో పండగ రోజు ఊరి గుడిలో నృత్య కార్యక్రమం జరిగింది. ఆ నృత్యం నన్ను పూర్తిగా నాట్యరంగం వైపు ఆకర్షింపజేసింది.

గుడి ప్రక్కనే ఉన్న తుమ్మచెట్టు దాని ఎండిన కాయలను ఊపితే లోపల గింజ కదులుతూ శబ్దం చేసేది. తుమ్మకాయలను విరిచి మూడు మూడుగా దారంతో వరుసగా కట్టి, వాటిని గజ్జెలుగా కాళ్ళకు కట్టుకుని నృత్య సాధన ఆరంభించాను. నేను ఏ గురువు దగ్గర నాట్యం నేర్చుకోలేదు.

దేవాలయాల్లో గోడలపై ఉన్న శిల్పాలు, నాట్యశాస్త్ర పుస్తకాలు నాకు గురువులు.

యాభై ఏళ్ళక్రితం తెలుగు దేశంలో నాట్యాన్ని చులకనగా చూసేవారు. అందుకే మానాన్న నన్ను నాట్యం నేర్చుకో వద్దని అన్నారు. నాట్యమే కావాలంటే ఇల్లు విడిచి పొమ్మన్నారు. అందుకే ఇల్లు విడిచి పట్టాను.

లక్షల ఆస్తిని వద్దనుకున్నాను. దరిద్రం అనుభవించాను. కాని పట్టుదలతో నాట్యం నేర్చుకున్నాను. దానినే అధ్యయనం చేశాను.

ఆ నాట్యమే నాకు పేరును, డబ్బును సంపాదించి పెట్టింది. ఇప్పుడు నా శిష్యులు, శిష్యుల శిష్యులు వేలాది మంది ప్రపంచమంతటా ఉన్నారు. మనం మరచిపోయిన "ఆంధ్రనాట్యానికి" ప్రచారం చేయగలిగాను. "పేరిణి శివతాండవం" రీతిని కూర్చాను. నాట్య శాస్త్రంపై ఎన్నో గ్రంథాలు రాశాను. నేను చేసిన దానికి నాకు సంతృప్తి ఉంది.

**అక్టోబర్ 1990, బాలచెలిమి**

# Oxford Grammar High School

OGS JUNIORS — grow naturally

43rd YEARS OF MERITORIOUS PERFORMANCE





## We make school time the best time for your kids

At OGS Juniors, all the children are given a warm, safe, and stimulating environment so that they can grow to become individuals while exploring, imagining, creating, and playing.

- Loving atmosphere & play ground
- CCTV surveillance
- Certified teachers & caring staff
- Kids zone & play area
- Interactive & Value based Learning

**CARING TEACHERS & STAFF**
Your child will get the best care and attention

**ECO-FRIENDLY PRACTICES**
We let the children play with nature friendly material

**HUGE PLAYGROUND**
Your child will get lots of fresh air and playtime

**INTERACTIVE LEARNING**
Our trusted method helps your child communicate and learn with ease.

**Street No. 13, Himayathnagar, Hyderabad | Ph : 040 2763 6214, 99590 20512**

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



**ప్రతులకు**

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com*   *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com